ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY
5

శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
మంగళవారం 29 జూలై 2025



• ఘనంగా గోదాదేవి జయంతి

కదిరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆండాల్ తిరునక్షత్రం సందర్భంగా లక్ష్మీనరసింహస్వామితోపాటు, శ్రీదేవి, భూదేవి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

జిల్లాలో మంత్రి రెండు రోజుల పర్యటన

ధర్మవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఈనెల 31, ఆగస్టు1 తేదీల్లో రెండు రోజులపాటు జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ చేతన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి ఈనెల 31న ఉదయం 7గంటలకు బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన 9-30గంటకు పుట్టపర్తికి వస్తారన్నారు. 10 గంటలనుంచి సాయంత్రం 4గంటల వరకు పుట్టపర్తిలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. అనంతరం ధర్మవరం చేరుకుంటారన్నారు. ఆగస్టు1న ధర్మవరంలో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 5-40గంటలకు విజయవాడకు రైలులో బయల్దేరి వెళ్తారన్నారు.

సాయిసేవలే పరమావధి

సేవాసంస్థల లండన్ ప్రతినిధి మెల్‌గ్రిపిన్


ప్రసంగిస్తున్న మెల్‌గ్రిపిన్


పాటలు పాడుతున్న భక్తులు


ర్యాలీగా వస్తున్న భక్తులు

పుట్టపర్తి, జూలై 28(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా చూపిన సేవామార్గమే తమకు పరమావధి అని సేవాసంస్థల లండన్ ప్రతినిధి మెల్‌గ్రిపిన్ అన్నారు. ఇంగ్లాండు, ఇతర యూరప్ దేశాలకు చెందిన సత్యసాయిబాబా భక్తులు పర్తియాత్ర పేరుతో సోమవారం ప్రశాంతి నిలయం చేరుకున్నారు. విదేశీ భక్తులు వారి దేశాల జాతీయ జెండాలు ధరించి ర్యాలీగా సాయికుల్వంతుకు చేరుకుని సత్యసాయి సమాధి వద్ద వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా లండన్ ప్రతినిధి మాట్లాడుతూ సత్యసాయిబాబా సేవలు, ప్రేమ, ఆధ్యాత్మిక బోధనలు తమకు పరమావధి అన్నారు. సత్యసాయి చూపిన సేవా బాటలో ప్రయాణిస్తూ సామాజిక సేవలను కొనసాగిస్తున్నామన్నారు. రూరల్ ప్రాంతాలలో విద్య, వైద్యం, అత్యవసర సేవలను అందిస్తున్నామన్నారు. సత్యసాయిబాబా బోధనలు, ప్రశాంత జీవనానికి మెట్టు అన్నారు. అనంతరం యూరప్ దేశాల్లో చేపట్టిన సేవలపై చిత్ర ప్రదర్శన చేశారు. తర్వాత విదేశీ భక్తులు భక్తి పాటలు ఆలపించారు. సాయంత్రం సాయికుల్వంతు సభామండపంలో సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఎస్‌బీఐలో చొరబడ్డ దొంగలు

• రూ.37.92 లక్షల నగదు, 10 కేజీల బంగారం మాయం



హిందూపురం మండలం తూమకుంట పారిశ్రామిక వాడలోని ఎస్‌బీఐ బ్రాంచిలో దొంగలు పడ్డారు. బ్యాంకు వెనుకవైపు కిటికీకి ఉన్న ఇనుప చువ్వలను కోసేసి లోపలికి ప్రవేశించారు. గ్యాస్ కట్టర్‌తో లాకర్‌ను తెరిచి, రూ.37.92 లక్షలు, 10 కేజీల బంగారం ఆభరణాలను చోరీ చేశారు. బ్యాంకులో 592 మంది బంగారం కుదువపెట్టారు. వీరిలో 205 మంది బంగారం భద్రంగా ఉన్నట్లు తేల్చారు. మిగిలినవారిలో ఎందరి బంగారం పోయిందో, ఎంత సురక్షితంగా ఉందో తేల్చేందుకు లెక్కింపు కొనసాగిస్తున్నారు.

(వివరాలు మెయిన్‌లో..)



భద్రత బంగారం?

• బ్యాంకుల్లో సొమ్ముకు భద్రత కరువు • సెక్యూరిటీ గార్డుల్లేని కొన్ని శాఖలు

సులువుగా కన్నం వేస్తున్న దొంగలు
తూమకుంట ఎస్‌బీఐలో భారీ చోరీ

హిందూపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఖర్చు తగ్గించుకోవాలని పలు బ్యాంకులు వ్యవహరిస్తున్న తీరు ఖాతాదారుల సొమ్ముకు భద్రత కరువయ్యేలా చేస్తోంది. బ్యాంకులు సెక్యూరిటీ గార్డులను నియమించు కోకపోవడంతో కోట్లాదిరూపాయలు విలువచేసే ఖాతాదారుల బంగారం, డబ్బుకు ప్రమాదం ఏర్పడుతోంది. సీసీ కెమెరాలపై ఆధారపడి ఎటువంటి సెక్యూరిటీ గార్డులను బ్యాంకు శాఖల వద్ద ఏర్పాటు చేయకపోవడంతో నేరస్తులు సులువుగా బ్యాంకులకు కన్నాలేయడానికి ప్రయత్నిస్తున్నారు. హిందూపురం మండలంలోని తూమకుంట చెక్‌పోస్టులో ఎస్‌బీఐలో జరిగిన భారీ దోపిడీనే ఇందుకు నిదర్శనం.


తూమకుంట చెక్‌పోస్టులో ముళ్లపొదల మధ్య ఉన్న ఎస్‌బీఐ శాఖ

సెక్యూరిటీ లేకపోవడమే..

ఇటీవల ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో జరిగిన బ్యాంకు దోపిడీ లను గమనిస్తే సెక్యూరిటీ లేకపోవడమే ప్రధాన కారణంగా అగుపిస్తోంది. ఇటీవల చాలా మంది ఖాతాదారులు ఇంట్లో బంగారం ఉంచుకోవడానికి భయపడి బ్యాంకుల్లో భద్రంగా ఉంటుందని లాకర్లలో భద్రపరుస్తున్నారు. ఇందుకు బ్యాంకులు కొంత మొత్తంలో సొమ్ము వసూలు చేస్తున్నాయి. అయితే ఖాతాదారుల సొమ్ముకు మాత్రం భద్రత కల్పించలేకపోతున్నాయి. పై వారి ఆదేశాలంటూ నిరంతరం కాపలా ఉండాల్సిన (మిగతా 6వ పేజీలో...)

సమస్యలపై ప్రత్యేక దృష్టి: ఎస్పీ


ఫిర్యాదిదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్) వచ్చే సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ రత్న అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, చట్టపరిధిలో పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో ఫిర్యాదులు పునరావృతం కాకూడదన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 76 అర్జీలను స్వీకరించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమానికి కుటుంబకలహాలు, భూసమస్యలు, ఆర్థిక మోసాలు, ఆస్తి పంపకాల వివాదాలు, సైబర్‌నేరాలపై ఎక్కువగా ఫిర్యాదులందాయి. కార్యక్రమంలో మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ సెల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధిక వడ్డీ వసూలు చేస్తే కఠిన చర్యలు

అధిక వడ్డీలు వసూలు చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రత్న పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ ధర్మవరంలో ఆదివారం వడ్డీ వ్యాపారులు భారతి, రమణ అనే వ్యక్తుల ఇంట్లోకి చొరబడి, ఆమె కుమారుడు బాలకృష్ణ పై దాడికి పాల్పడిన సంఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన వారిపై ధర్మవరం టూటౌన్ పోలీసుస్టేషన్లో కేసు నమోదు చేశామన్నారు. రౌడీషీట్ కూడా ఓపెన్ చేస్తామన్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం డీఎస్పీ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటుచేసి గాలిస్తున్నట్లు వెల్లడించారు. ఇంకా ఎవరైనా వడ్డీ వ్యాపారుల బాధితులు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావాలని సూచించారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

అడ్డుకున్న అధికారులు

పెనుకొండ, జూలై 28(ఆంధ్రజ్యోతి): కంచిసముద్రం గ్రామ సర్వేనంబరులో ఉన్న ప్రభుత్వ భూమిని కంచిసముద్రం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కబ్జా చేసేందుకు ప్రయత్నించగా గ్రామస్తులు వెంటనే తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె స్పందించి కబ్జాను అడ్డుకున్నారు. అనంతరం తహసీల్దార్ విలేకరులతో మాట్లాడుతూ కంచిసముద్రం పొలంలో సర్వే నంబరు 184లో ఆరెకరాల ప్రభుత్వ పొలం ఉందన్నారు. కొండ ప్రాంతానికి దగ్గరగా ఉండటంతో కంచిసముద్రం గ్రామానికి చెందిన ఓవ్యక్తి దొడ్డిదారిలో జేసీబీ సాయంతో ఆ భూమిని చదును చేసి ఆక్రమించుకునేందుకు యత్నించగా..


భూమిని ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్న దృశ్యం

రాల భూమిని ఎక్స్‌కవేటర్‌తో చదును చేయిస్తుండగా గ్రామస్తులు తన దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. వెంటనే స్పందించి సిబ్బందికి పంపి పనులు నిలిపివేయించామని వివరించారు. ఎవరైనా ప్రభుత్వ భూమిని కబ్జాచేసేందుకు ప్రయత్నిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అత్యాధునిక విద్యాలయం..!



- అనంతకు వరం సెంట్రల్ యూనివర్సిటీ
- 2018లో ఏర్పాటు... ఆరు కోర్సులు
- నేడు 26 కోర్సులు, వేలాదిమంది విద్యార్థులు
- నేడు వర్సిటీని ప్రారంభించనున్న కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ (7లో...)

హెచ్‌డీఎఫ్‌సీలో బంగారం మాయం మెయిన్‌లో

బిల్లులు రాక దిగాలు..!

- కూటమి నాయకులే కాంట్రాక్టర్లు
- శరవేగంగా పల్లె పండుగ పనులు
- నేటికీ అందని బిల్లులు
- అప్పులకు వడ్డీలు కట్టలేక తిప్పలు
- కొత్త పనులు చేయించడం అధికారులకు సవాలే..


అనంతపురంలోని మధురానగర్‌లో వేసిన సీసీ రోడ్డు

అనంతపురం న్యూటౌన్, జూలై28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి పనుల ఊసేలేకుండా పోయింది. కూటమి కొలువుదీరగానే పల్లె పండుగ పేరుతో పెద్దఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో సభలు పెట్టి ప్రజాప్రతినిధులు.. అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తామని ప్రకటించారు. ఆ మేరకు పార్టీ శ్రేణుల్లో సైతం ఉత్సాహం నింపారు. అదే ఊపులో ఉపాధి హామీ పథకం నిధులు రూ.105 కోట్లతో జిల్లాలో రోడ్ల పనులను గుర్తించారు. బిల్లులు వెంటనే వస్తాయన్న ఉద్దేశంతో కూటమి పార్టీల నాయకులే కాంట్రాక్టర్ల అవతారమెత్తారు. పోటీపడి మరీ.. పనులు దక్కించుకున్నారు. అప్పులు చేసి, పనులు చాలావరకు పూర్తి

(మిగతా 6వ పేజీలో...)

సంతృప్తిచెందేలా పరిష్కారం చూపండి

• అధికారులకు కలెక్టర్ ఆదేశం


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై ప్రజలిచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వారు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి 234 అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలిచ్చిన అర్జీల పరిష్కారంలో సంబంధిత అధికారులు అలసత్వం ప్రదర్శించకూడద న్నారు. ముఖ్యంగా భూ సమస్యలు, రేషన్ కార్డులు, పింఛన్ల అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాలను అధికారులు నిరంతరం సందర్శించి, విద్యార్థులకు అందుతు న్న సౌకర్యాలపై ఆరా తీయాలన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్వో విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీపీఓ సమత, డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, డీసీఓ కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డు ప్రవాహం



- హంద్రీనీవాలో 2 వేల క్యూసెక్కుల పైగా ప్రవాహం
- రాగులపాడు వద్ద 8 పంపుల ద్వారా ఎత్తిపోతలు

7

వడ్డీ వ్యాపారులను కఠినంగా శిక్షించాలి

• సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

ఎస్సీ, ఎస్టీ భూముల బదలాయింపు

చట్టాన్ని అమలు చేయాలి

● ఇన్‌చార్జి కలెక్టర్‌కు నాయకుల వినతి



ఇన్‌చార్జి కలెక్టర్‌తో దళిత సంఘాల నాయకులు

అనంతపురం కలెక్టరేట్, జూలై 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ భూముల బదలాయింపు చట్టాన్ని అమలు చేయాలని పలు దళిత, గిరిజన సంఘాలు డిమాండ్ చేశాయి. ఆ సంఘాల నాయకులు నేరిమెట్ల ఎల్లన్న, చిన్న పెద్దన్న, నగేష్, రమణ, రామాంజినేయులు తదితరులు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతపురం రూరల్ మండలం కురుగుంటలో ఎరికల ఆదినారాయణమ్మకు చెందిన సర్వే నంబరు 136-3వ లెటర్‌లో కొంత భూమిని ఇతరులు రిజిస్టర్ చేయించుకున్నారని, పోలీసులు కేసు కట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై 30సార్లు అధికారులకు విన్నవించుకున్నామని, ఎవరూ పట్టించుకోలేదని అన్నారు. ఏ శాఖ నుంచైనా ఎండార్స్‌మెంట్లు వస్తాయని, కానీ తహసీల్దార్లు మాత్రం ఎండార్స్‌మెంట్లు ఇవ్వడం లేదని వాపోయారు. తక్షణమే అధికారులతో మాట్లాడి తమకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో ఇన్‌చార్జ్ కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి, త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఉపాధి హామీ పథకంలో అవినీతి

● సాకే శైలజానాథ్



తమ నియోజకవర్గంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని వైసీపీ శింగనమల నియోజవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ ఇన్‌చార్జి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, అధికార పార్టీ నాయకులు ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. పనులు కల్పించినందుకు ఒక్కో కూలీ నుంచి వారానికి రూ.200, రూ.300 వసూలు చేస్తున్నారని అన్నారు. బీకేఎస్ మండలంలో వాటాల చెల్లింపు విషయంలో నాయకులు రోడ్డుపైనే కొట్టుకున్నారని, నార్పల మండలంలో అక్రమాలకు పాల్పడి, సస్పెండ్ అయినవారు కూడా విధులలో కొనసాగుతున్నారని అన్నారు. పుట్లూరు మండలంలో చనిపోయిన వ్యక్తుల పేరిట బిల్లులు పెట్టి సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

టీసీ ఇవ్వడం లేదు..

నగర శివారులోని పాములాయి వద్దనున్న ఓ ప్రైవేటు పాఠశాలలో టీసీ ఇవ్వకుండా వేధిస్తున్నారని ఏకలవ్య ఫెడరేషన్ అధ్యక్షుడు వెంకటరామయ్య ఇన్‌చార్జి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భరత్ అనే ఏడో తరగతి విద్యార్థికి రూ.20వేలు ఫీజు చెల్లిస్తేనే టీసీ ఇస్తామని అంటున్నారని, పేద కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.



చెరువుకట్టపై పూజలు నిర్వహిస్తున్న భక్తులు



అనంతపురంలో నాగులపుట్ట వద్ద...

నాగరాజా కరుణించు..!

అనంతపురం టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాస చవితిని పురస్కరించుకుని సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో నాగదేవతలకు విశేష పూజలు నిర్వహించారు. సుభాష్‌రోడ్డులోని నాగుల పుట్ట, మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, చెరువుకట్ట తదితర ప్రాంతాల్లోని నాగుల కట్టలు, పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నాగుల ప్రతిమలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, ఒకరికొకరు చేతులకు కంకణాలు కట్టుకుని, నాగదేవతలను స్తుతిస్తూ పుట్టలో పాలుపోశారు. చిన్న, పెద్ద తేడా లేకుండా అన్ని వయసుల వారు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.





స్వాతంత్ర్య దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

● ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 79వ స్వాతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, ఆర్డీఓ మల్లోలతో కలిసి ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 15న పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహిస్తామన్నారు. లోటుపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రౌండ్‌లో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, జెండా వందనం, కవాతు ఏర్పాట్లను పోలీస్ శాఖ, కార్యక్రమం నిర్వహణ పూర్తి ఏర్పాట్ల పర్యవేక్షణ, ప్రోటోకాల్‌ను అనంతపురం ఆర్డీఓ చూడాలని, అనంతపురం తహసీల్దారు సీటింగ్ ఏర్పాట్లను చేపట్టాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమ నిర్వహణను డీఈఓ చూడాలని, అత్యవసర వైద్య సేవలను డీఎంహెచ్ఓ, పారిశుధ్యం, తాగునీటి ఏర్పాటును నగర కమిషనర్ చూడాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలపై స్టాల్స్ వ్యవసాయం, ఉద్యానశాఖ ఏపీఎంఐపీ, పశుసంవర్ధకశాఖ, మత్స్యశాఖ, చేనేత, జౌళిశాఖ, పథక సంచాలకులు, డీఆర్డీఏ- వెలుగు, మెప్మా, మహిళా శిశు సంక్షేమ శాఖ, సంక్షేమ శాఖలకు చెందిన ఒక పెద్ద స్టాల్ ఏర్పాటు చేయాన్నారు. ఇన్‌చార్జ్‌గా హెచ్ఎస్ఎస్ ఎస్‌డీసీ వ్యవహరిస్తారన్నారు. ఎవరికి కేటాయించిన పనులను వారు సక్రమంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్

కయ్యం తెచ్చిన 'కసువు'

● ఫిర్యాదు చేస్తే మాపైనే కేసు పెట్టారు
● ఎస్పీ వద్దకు కళ్యాణదుర్గం రూరల్ స్టేషన్ బాధితులు
● పోలీస్ పీజీఆర్ఎస్‌లో 87 అర్జీలు

అనంతపురం క్రైం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఊడ్చే కసువు (చెత్త)కయ్యం తెచ్చి పెట్టింది. ఇది పోలీస్టేషన్, తర్వాత ఎస్పీ వరకూ వెళ్లేలా చేసింది. తమపై దాడి చేశారని ఫిర్యాదు చేస్తే.... దాడి చేసిన వాళ్ల ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తమపైనే కేసు పెట్టారని బాధిత దంపతులు ఎస్పీ జగదీష్ వద్ద మొరపెట్టుకున్నారు. ఈ ఘటన కళ్యాణదుర్గం రూరల్ పోలీస్టేషన్‌లో జరిగింది. బీకేఎస్ మండలం సంజీవపురంలో గేదెలు ఎత్తుకెళ్లారని, న్యాయం చేయాలని బాధితులు విన్నవించుకున్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జగదీష్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, బాధితులు హాజరైన విన్నవించుకున్నారు. మొత్తం 87 అర్జీలు వచ్చినట్లు డీపీఓ వర్గాలు తెలిపాయి.

ఫిర్యాదు చేసిన మాపైనే కేసు...

కసువు తెచ్చిన కయ్యం విషయంగా ఎం.కొండాపురం గ్రామానికి చెందిన సుధారాణి, ఆమె భర్త శ్రీనివాసాచారి ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. సుధారాణి మాట్లాడుతూ 'ఈ నెల 13న ఇంటి ముందుర ఖాళీ స్థలంలో కసువు ఊడుస్తుండగా పక్కింటి శాంతమ్మ ఇక్కడెలా ఊడుస్తావంటూ గొడవకు దిగింది. ఎదురింట్లో ఉన్న సురేష్, స్వామిలాల్ క్రిష్ణ, సులోచన వచ్చి, బూతులు తిడుతూ దాడి చేశారు. నా కుమార్తె బిందుమతిని కూడా కాళ్లతో తన్నారు. వీళ్ల దాడిపై అదే రోజు కళ్యాణదుర్గం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. అయితే శాంతమ్మ 19న ఫిర్యాదు చేస్తే, వాళ్ల ఫిర్యాదు మేరకు నాతోపాటు నా భర్త, కుమార్తైపై పోలీసులు కేసు పెట్టారు. మాకు కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు అన్యాయం చేశారు. మీరే న్యాయం చేయాలి' అని ఎస్పీకి విన్నవించారుజ

సిగ్నల్ ఆధారంగా... గేదెలు కనిపెట్టండి

తమ గ్రామంలో గేదెలు చోరీ అవుతున్నాయని, న్యాయం జరిగేలా చూడాలని బాధితులు బుక్కరాయసముద్రం మండలం సంజీవపురానికి చెందిన ఓబిరెడ్డి, రామలింగారెడ్డి ఎస్పీకి విన్నవించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 21న ఓబిరెడ్డికి చెందిన గేదె, భాస్కర్‌రెడ్డికి చెందిన గేదె, రామలింగారెడ్డి సోదరి పెద్దక్క గేదె మార్చి 25న చోరీ అయ్యాయన్నారు. తమ పంచాయతీలో సెల్ టవర్ ఉందని, చెన్నంపల్లి పంచాయతీలోని సెల్ టవర్ సిగ్నల్స్ తగులుతాయని, వాటి ఆధారంగా కాల్ డేటా సేకరించి గేదెలు చోరీ చేసిన నిందితులను అరెస్టు చేయాలని కోరారు.

భద్రత బంగారం?

(5వ పేజీ తరువాయి)

సెక్యూరిటీగార్డ్‌లను తొలగిస్తున్నారు. దీంతో దొంగలు సీసీ కెమెరాలను ధ్వంసం చేసి తమ పనిని సులువగా చేసుకువెళ్తున్నారు.



బ్యాంకులో పరిశీలిస్తున్న డీఎస్పీ మహేష్

ఆందోళనలో ఖాతాదారులు

ఇదిలా ఉంటే పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకుని చోరీల భయంతో ప్రజలు ఇళ్లలో బంగారం ఉంచుకోవడం లేదు. తమ సొమ్ముకు భద్రత ఉంటుందనే భావనలో బ్యాంకులో తనఖా పెట్టి కొంత రుణం తీసు కుంటున్నారు. మరి కొందరు లాకర్లలో పెడుతున్నారు. కానీ తూమకుంట ఎస్‌బీఐలో జరిగిన సంఘటనలతో హిందూపురం ప్రాంతంలోని బ్యాంకుల ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ఏదైనా లాకర్లలో సొమ్ముపోతే అదిపెట్టిన వ్యక్తులపైనే ఉంటుంది కానీ బ్యాంకులపై ప్రభావం ఉండదు. దీంతో ఖాతాదారులకు ధైర్యం చెప్పడానికి బ్యాంకర్లు తీవ్రంగా యత్నిస్తున్నట్లు తెలిసింది.



బ్యాంకులో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

నివాసాలకు దూరంగా..

ఉమ్మడి జిల్లాలో అనంతపురం తరువాత హిందూపురంలోనే బ్యాంకు శాఖలు ఎక్కువగా ఉన్నాయి. సుమారు 25కిపైగా బ్యాంకులు ఉండగా ఫైనాన్స్ సంస్థలు 20కిపైగా ఉన్నాయి. ఇందులో చాలా వరకు నివాసాలకు దూరంగా ఉన్నాయి. ముఖ్యంగా హిందూపురం మండలం లోని తూమకుంట చెక్‌పోస్టులో ఉన్న ఎస్‌బీఐ, వడ్డిపల్లిలో ఉన్న మరో బ్యాంక్ భవనం చుట్టూ కంపచెట్లు ఏపుగా పెరిగాయి. పగటిపూట సైతం ఎవరైనా వెళ్తే గుర్తించలేని విధంగా పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో తూమకుంట వద్ద ఉన్న ఎస్‌బీఐ శాఖలో కిటికీ ఊచలను గ్యాస్ కట్టర్‌తో తొలగించి దొంగలు లోపలికి చొరబడ్డారు. లాకర్లలో ఉన్న రూ.37.92 లక్షల నగదు, భారీగా బంగారం ఆభరణాలను ఎత్తుకెళ్లారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో దొంగలు సులువుగా పని ముగించారు. ఈక్రమంలోనే బ్యాంకులు, బంగారం కుదువ పెట్టుకునే ఫైనాన్స్ కంపెనీలు రూ.కోట్ల విలువైన ఖాతాదారుల బంగారానికి సరైన భద్రత కల్పించల్సి ఉంది.



సెక్యూరిటీ గార్డ్‌ను పెట్టుకోవాలి: డీఎస్పీ

హిందూపురం సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న బ్యాంక్‌లవద్ద రాత్రింపగళ్లు సెక్యూరిటీగార్డ్‌ను తప్పనిసరిగా పెట్టుకోవాలి. సెక్యూరిటీగార్డ్ ఉంటే చోరీ జరగడానికి ఆస్కారం ఉండదు. కోట్లాది రూపాయలు విలువచేసే బంగారం నగలు, నగదు పెట్టుకుని సెక్యూరిటీగార్డ్ పెట్టకపోవడం విడ్డూరంగా ఉంది. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సెక్యూరిటీగార్డ్ ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటాం.

ఉత్తమ పీఎంశ్రీ స్కూల్‌గా గుత్తి ఏపీఆర్ఎస్

అనంతపురం విద్య, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఉత్తమ పీఎం శ్రీ స్కూల్ (ప్రైమ్‌మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా)గా గుత్తి ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల ఎంపికైంది. దేశంలో ప్రతి రాష్ట్రం నుంచి విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దిన స్కూళ్లను బెస్ట్ పీఎం శ్రీ పాఠశాలలుగా కేంద్రమానవ వనరుల శాఖ ఎంపిక చేసింది. అందులో మన రాష్ట్రం తరపున జిల్లాకు చెందిన గుత్తి ఏపీఆర్ఎస్ స్కూల్ ఎంపికైనట్లు ఎస్ఎస్ఎ ఏపీసీ శైలజ సోమవారం తెలిపారు. దీనిపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

సాగు చేసే పంటలకు మాత్రమే

బీమా ప్రీమియం

● జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 28(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసే పంటలకు మాత్రమే ప్రీమియంను జమ చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్‌బీమా పథకం, వాతావరణ పంటల బీమా పథకం విధి, విధానాలు, ప్రయోజనాలు, పంటల వారిగా రైతు ఎకరాకు చెల్లించాల్సిన వివరాలను వివరించారు. అనంతరం ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు తెలిసేలా గ్రామాల్లో ప్రచారం చేసి, పంటల బీమా నమోదు చేసుకునేలా చూడాలని సూచించారు. ఇంతవరకు వాతావరణ బీమా పథకంలో 1,47,122హెక్టార్లకు 1,59,100 మంది రైతులు, దిగుబడి ఆధారిత బీమాలో 8,662.12 హెక్టార్లకు గాను 10,194 మంది రైతులు పంట నమోదు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

నేడు స్వమిత్వపై శిక్షణ

అనంతపురం న్యూటౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని స్వమిత్వ పథకంలో ఎంపికైన 280 గ్రామాలకు సంబంధించిన సిబ్బందికి మంగళవారం మండల స్థాయిలో శిక్షణ ఏర్పాటు చేసినట్లు డీపీఓ నాగరాజనాయుడు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మండల సర్వేయర్లు వారికి సంబంధించిన శిక్షణా కేంద్రాల్లో శిక్షణకు హాజరయ్యేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ శిక్షణ ప్రణాళిక ప్రకారం జరిగేలా సంబంధిత డిప్యూటీ ఎంపీడీఓలు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

శిక్షణాకేంద్రాలు ఇలా...

అనంతపురం రూరల్, కూడేరు మండలాకు సంబంధించి అనంతపురం ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఏర్పాటు చేశారు. బుక్కరాయసముద్రం, నార్పల మండలాలకు బుక్కరాయసముద్రం ఎంపీడీఓ కార్యాలయం, రాప్తాడు, ఆత్మకూరు మండలాలకు రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయం, గార్లదిన్నె, శింగనమలకు గార్లదిన్నె ఎంపీడీఓ కార్యాలయం, తాడిపత్రి, పెద్దపప్పూరు మండలాలకు తాడిపత్రి ఎంపీడీఓ కార్యాలయం, యాడికి, పెద్దవడుగూరుకు యాడికి ఎంపీడీఓ కార్యాలయం, గుత్తి, పామిడికి గుత్తి ఎంపీడీఓ కార్యాలయం, గుంతకల్లు, వజ్రకరూరుకు గుంతకల్లు ఎంపీడీఓ కార్యాలయం, ఉరవకొండ, బెళుగుప్ప, విడపనకల్లుకు ఉరవ కొండ ఎంపీడీఓ కార్యాలయం, రాయదుర్గం, గుమ్మఘట్టకు రాయదుర్గం ఎంపీడీఓ కార్యాలయం, బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్‌కు బొమ్మనహాళ్ ఎంపీడీఓ కార్యాలయం, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రంకు కళ్యాణదుర్గం ఎంపీడీఓ కార్యాలయం, కుందుర్పి, కంబదూరు, శెట్టూరుకు కుందిర్పి ఎంపీడీఓ కార్యాలయం, పుట్లూరు, యల్లనూరుకు పుట్లూరు ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఇచ్చేలా ఏర్పాటు చేశారు.

బిల్లులు రాక దిగాలు!

(5వ పేజీ తరువాయి)

చేశారు. బిల్లులు మాత్రం అందలేదు. చాలామందికి రూపాయి కూడా రాలేదు. దీంతో పనుల కోసం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక తిప్పలు పడుతున్నారు. ప్రజాప్రతినిధుల వద్ద మొరపెట్టుకున్నా.. వారు పట్టించుకోవట్లేదని బాధితులు వాపోతున్నారు. 'పనులు చేయండి.. బిల్లులు వచ్చేలా చూస్తాం' అంటూ హామీ ఇచ్చిన అధికారులు.. మొహం చాటేస్తున్నారు. దీంతో పనులు చేసిన కూటమి నాయకులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఈ పరిస్థితుల్లో మళ్లీ అభివృద్ధి పనులు చేయించడం అధికారులకు సవాల్‌గా మారింది. కొత్త పనులు చేయించలేమని చేతులెత్తేస్తున్నారు.

పెద్దఎత్తున పనులు

కూటమి కొలువుదీరాక గతేడాది అక్టోబరులో పల్లె పండుగ కింద జిల్లావ్యాప్తంగా 1,961 రోడ్డు పనులను గుర్తించారు. 217.18 కిలోమీటర్ల పొడవైన రోడ్ల పనులు రూ.105 కోట్లతో చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. కూటమి నాయకులే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి 1,838 పనులు పూర్తిచేశారు. 109 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. 14 పనులు ప్రారంభమే కాలేదు. పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా.. బిల్లులు మాత్రం మంజూరు కాలేదు. దీంతో మిగిలిన పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపట్లేదు. మందకొడిగా సాగుతున్నాయన్న వాదనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో నియోజవర్గానికి రూ.3 కోట్లతో పనులు మంజూరు చేశారు. అధికారులు అంచనాలు తయారు చేసి, ప్రభుత్వానికి పంపారు. పల్లె పండుగ బిల్లులే రాని పరిస్థితుల్లో కాంట్రాక్టర్లతో కొత్త పనులు చేయించడం వారికి తలనొప్పిగా మారింది. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి పూర్తిచేసిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులకు రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో శ్రీకారం చుట్టింది. దీంతో అధికారులు ఉత్సాహంగా బిల్లులు అప్‌లోడ్ చేశారు. ఆ ప్రక్రియ పూర్తయి నెల గడిచినా చిల్లిగవ్వ కూడా బిల్లులు విడుదల కాలేదు. దీంతో అధికారులను నైరాశ్యం ఆవరించింది. ఈ పరిస్థితుల్లో పల్లె పండుగలో అనుమతి పొందిన 14 పనులు మొదలెట్టడానికి కూడా కాంట్రాక్టర్లు వెనకడుగు వేస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం చేసిన పనులకు సంబంధించి బిల్లులు మంజూరైతే తప్ప.. కొత్తగా చేసే పరిస్థితులు కనిపించడం లేదన్న చర్చ సాగుతోంది.

డీలాపడ్డ నాయకులు

పల్లె పండుగ పనులు చేసిన కూటమి నాయకులు బిల్లులు రాక డీలా పడ్డారు. తమ సమస్య ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక కుమిలిపోతున్నారు. పనుల కోసం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారన్న ప్రచారం సాగుతోంది. నియోజకవర్గ నాయకుల వద్దకెళ్లి గోడు చెప్పుకుందామంటే.. వారు కూడా పట్టించుకోవట్లేదని తెలుస్తోంది. దీంతో పనులు చేసిన మండల, గ్రామస్థాయి నాయకులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

బిల్లులన్నీ అప్‌లోడ్ చేశాం

పల్లె పండుగ పేరుతో చేపట్టిన పనులన్నీ దాదాపు పూర్తయ్యాయి. వాటికి సంబంధించి బిల్లులను అప్‌లోడ్ చేశాం. బిల్లులు పడుతున్నాయి. ఆగస్టు 15లోపు మొత్తం బిల్లులు పడతాయని భావిస్తున్నాం.

-ప్రభాకర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ, పంచాయతీ రాజ్ శాఖ



వెనక్కు పంపించేన్..!

● మంజూరైనా లబ్ధిదారులకు అందని సొమ్ము ● డబ్బు వెనక్కు పంపిన కార్యదర్శి ● భర్త పింఛన్ కోసం వితంతువుల ఎదురుచూపు

● మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో రామచంద్ర అనే వ్యక్తి మృతి చెంది ఏడాది అయ్యింది. ఆయన భార్యకు రాష్ట్ర ప్రభుత్వం వితంతు పింఛన్ మంజూరు చేసింది. గత నెలలో పింఛన్ సొమ్ము అందించాల్సి ఉన్నా ఇవ్వలేదు.

● శ్రీధరఘట్ట గ్రామంలో ఉప్పర గోవింద ఏడాది కిందట మృతి చెందాడు. ఆయన భార్య ఈరమ్మకు ఇటీవల వితంతు పింఛన్ మంజూరైంది. గత నెల డబ్బులు వచ్చినప్పటికీ ఆమెకు ఇవ్వలేదు. కారణం తెలియదు. పింఛన్ సొమ్మును తిరిగి ప్రభుత్వానికి కార్యదర్శి జమచేశారు. ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే.

బొమ్మనహాళ్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలో పింఛన్ కోసం అనేకమంది వితంతువులు ఎదురు చూస్తున్నారు. ఇదివరకు భర్తకు వస్తున్న పింఛన్ తమకు ఇప్పించమని దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్నారు. వైసీపీ పాలనలో మూడేళ్ల మాత్రమే కొత్త పింఛన్లు మంజూరు చేశారు. తర్వాత పట్టించుకోలేదు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఎన్నికల హామీ మేరకు వృద్ధులు, వితంతువుల పింఛన్ మొత్తాన్ని ఒకేసారి రూ. 1000 పెంచి రూ.4వేలు చేశారు. 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్య కాలంలో మృతి చెందిన పింఛన్ లబ్ధిదారులకు సంబంధించి, వారి జీవిత భాగస్వా ములకు కొత్త పింఛన్ మంజూరు చేస్తామని ప్రభుత్వం తెలిపింది. ఈ ఏడాది మే నెలాఖరుకు అర్హుల జాబితాను ప్రకటించి, జూన్ నుంచి పంపిణీ చేస్తామని చెప్పింది కానీ జూలై గడిచిపోతున్నా కొత్త పింఛన్లు మంజూరు కాకపోవడంతో వితంతువులు ఆందోళన చెందుతున్నారు.

81 పింఛన్ల మంజూరు

మండలంలో కొత్తగా 81 పింఛన్లు మంజూరయ్యాయి. వీటికి సంబంధించి సుమారు రూ.3.24లక్షలు వచ్చాయి. గతనెల 12న పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించారు. ఏమైందో తెలియదు గానీ పంపిణీ చేయకుండా తిరిగి ఆ డబ్బును ప్రభుత్వానికి జమచేశారు. జూలైలో కూడా డబ్బులను వెనక్కు పంపారు. దీంతో పింఛన్ వస్తుందని ఎదురు చూసిన వితంతువులకు నిరాశే మిగిలింది. టీడీపీ నాయకులు తొలిఅడుగు కార్యక్రమంలో బిజీగా ఉన్నారు. దీంతో కొత్త పింఛన్ల పంపిణీలో జాప్యం జరుగుతున్నట్లు సమాచారం. ఆగస్టు నెలలోనైనా పింఛన్ డబ్బులు వస్తాయా అని పలువురు వితంతువులు ఎదురు చూస్తున్నారు.

ఆదేశాలు రావాలి

కొత్త పింఛన్లు ఇవ్వడానికి రెండు, మూడు రోజుల్లో ఆదేశాలు వస్తాయని అంటున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. అందుకే రెండు నెలల సొమ్ము వచ్చినా, లబ్ధిదారులకు ఇవ్వకుండా, తిరిగి ప్రభుత్వానికి జమ చేశాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే పంపిణీ చేస్తాం.

-విజయభాస్కర్, ఎంపీడీఓ, బొమ్మనహాళ్

పింఛన్ ఇచ్చి ఆదుకోవాలి: లక్ష్మీదేవి, ఉద్దేహాళ్



నా భర్త రామచంద్ర చనిపోయి ఏడాది అవుతుంది. నాభర్తకు వచ్చే పింఛన్ డబ్బులతో జీవించేవాళ్లం. మాకు పిల్లలు లేరు. నా భర్త చనిపోయినప్పటి నుంచి జీవనం కష్టంగా ఉంది. ప్రభుత్వం మంజూరు చేసిన వితంతువు పింఛన్ డబ్బులు ఇచ్చి ఆదుకోవాలి. ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నా. మాత్రలు కొనాలన్న డబ్బులు లేక సమస్యగా ఉంది.

కూలి పనులకు వెళ్తున్నా: ఈరమ్మ, శ్రీధరఘట్ట



నా భర్త చనిపోయినా ఆయనకు వచ్చే పింఛన్ నాకు వస్తుందంటే కాస్తంత ఊరట చెందా. నా జీవనానికి పింఛన్ డబ్బులు తోడవుతాయని అనుకున్నా. దరఖాస్తు చేయగానే ప్రభుత్వం పింఛన్ కూడా మంజూరు చేసింది. అయితే డబ్బులు ఇవ్వలేదు. దీంతో వ్యవసాయ పనులకు కూలి పనులకు వెళ్లి బతుకుతున్నా. నాకు పిల్లలు లేరు. ప్రభుత్వం పింఛన్ డబ్బులు ఇచ్చి ఆదుకోవాలి.

అత్యాధునిక విద్యాలయం..!

- అనంతకు వరం సెంట్రల్ యూనివర్సిటీ
- 2018లో ఆరు కోర్సులు..
- వందమంది విద్యార్థులతో ప్రారంభం
- నేడు 26 కోర్సులు, వేలాదిమంది విద్యార్థులు
- అత్యాధునిక భవనాలు, వసతులు
- ఆహ్లాదకర వాతావరణంలో విద్యాబోధన
- నేడు వర్సిటీని ప్రారంభించనున్న కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్



యూనివర్సిటీ ముఖద్వారం


సుందరంగా తీర్చిదిద్దిన రోడ్లు

అనంతపురం వైద్యం, జూలై 28(ఆంధ్రజ్యోతి): అధునాతన విద్యకు వేదిక అయిన కేంద్రీయ విశ్వవిద్యాలయం దినదినాభివృద్ధి చెందుతోంది. చిన్నగా ప్రారంభమై, వందల ఎకరాలకు విస్తరించింది. అనంతకు తలమానికంగా మారింది. వేలాది మంది విద్యార్థులకు అధునాతన కోర్సులను బోధిస్తోంది. ఉపాధి కల్పనలో మేటిగా నిలుస్తోంది. బుక్కరాయసముద్రం మండలం జంతలూరు వద్ద వేలమంది విద్యార్థులు, అత్యాధునిక వసతులు, భవనాలు.. ఇలా.. అన్నీ అద్భుతమే. అభివృద్ధి చెందిన దేశాల్లోని వర్సిటీలను తలదన్నేలా ఉంది.

ఆరు కోర్సులతో ప్రారంభం

రాష్ట్ర విభజనలో భాగంగా ఏపీకి రావాల్సిన సెంట్రల్ యూనివర్సిటీని అప్పటి టీడీపీ ప్రభుత్వం జిల్లాలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా సీయూఏపీ 2018లో సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం 1860కింద అనంతపురంలో స్థాపించిన సెంట్రల్ యూనివర్సిటీ 2019లో పార్లమెంట్ చట్టం ద్వారా అధికారికంగా గుర్తింపు పొందింది. తాత్కాలికంగా 2018 ఆగస్టు 5న జేఎన్టీయూలో ఆరు కోర్సులతో విద్యాబోధన ప్రారంభించారు. అనంతరం శాశ్వత వర్సిటీ నిర్మాణానికి బుక్కరాయసముద్రం మండలం జంతలూరు వద్ద 491.03 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వ కేటాయించింది. అందుకు అవసరమైన ప్రహరీ, విద్యుత్, నీరు, రెండు లైన్ల రహదారి రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చింది. 2019లో ప్రభుత్వం మారడంతో వర్సిటీ అభివృద్ధి మందకొడిగా సాగింది. అవసరమైన అనుమతులు, నిధుల విషయంలోనూ నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటుకావడంతో సెంట్రల్ వర్సిటీ అభివృద్ధి వేగం పుంజుకుని పనులు పూర్తిచేసేలా పర్యవేక్షించింది. దీంతో మంగళవారం నూతన సెంట్రల్ యూవర్సిటీగా ప్రారంభం కానుంది. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వర్చువల్‌గా వర్సిటీని ప్రారంభించనున్నారు.

1600 మందికిపైగా విద్యార్థులు

2018 ఆగస్టు 5న నాలుగు డిగ్రీ, రెండు పీజీ కోర్సులతో సెంట్రల్ యూనివర్సిటీ ప్రారంభించారు. ప్రస్తుతం 47 కోర్సులతో 23 రాష్ట్రాలకు చెందిన 1600 మందికిపైగా విద్యార్థులు క్యాంపస్‌లో అభ్యసిస్తున్నారు. 9 డిగ్రీ, 17 పీజీ, 6 పీహెచ్‌డీ, 15 డిప్లొమా కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తున్నారు. గత ఐదేళ్లలో వందలాది మంది విద్యార్థులు కోర్సులు పూర్తిచేసుకుని పట్టాలు పొందారు. వివిధ రంగాల్లో వారు ఉద్యోగాలు చేస్తున్నారని ప్లేస్‌మెంట్ అధికారులు తెలిపారు. క్యాంపస్‌లో పరిపాలనా భవనంతోపాటు మొత్తం 34 నూతన భవనాలను అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించారు.

నూతన క్యాంపస్

బుక్కరాయసముద్రం మండలం జంతలూరు వద్ద 491.03 ఎకరాల్లో వర్సిటీ నూతన క్యాంపస్‌ను ఏర్పాటు చేశారు. భవన నిర్మాణాలు, వసతుల కల్పనకు రూ.711 కోట్లను కేటాయించారు. మొదటి దశ కింద రూ.350 కోట్లు వెచ్చించి నిర్మాణాలు చేపట్టారు. ఇందులో ముఖ్యంగా 2200 మంది విద్యార్థులు వసతి పొందేలా ఆరు అంతస్థుల హాస్టల్ భవనాలు నిర్మించడం విశేషం. ఆహ్లాదకరమైన వాతావరణంలో, అత్యాధునిక భవనాలు, నూతన వసతుల మధ్య విద్యార్థులకు బోధిస్తున్నారు.

పరిశోధనలకు పునాది



పరిశోధన రంగంలో విద్యార్థులు ప్రవేశించేందుకు సెంట్రల్ యూనివర్సిటీ ఒక పునాది. బీఎస్సీ ప్రైవేటు కళాశాలలో పూర్తిచేశా. సైంటిస్ట్ కావాలన్న ఆకాంక్షతో ఉన్నత చదువులకు వెళ్లాలంటే ప్రైవేటు విద్యాసంస్థల్లో అధికంగా ఖర్చుచేయాల్సి ఉంటుంది. సెంట్రల్ యూనివర్సిటీ నోటిఫికేషన్‌తో ప్రవేశం పొంది పీజీ పూర్తి చేస్తున్నా.

- అంజుమ్, పీజీ ద్వితీయ సంవత్సరం, మాలిక్యులర్ బయాలజీ

ప్రత్యేక కోర్సులు



వర్సిటీలో ప్రత్యేక కోర్సులు అందిస్తున్నారు. సెంట్రల్ యూనివర్సిటీలో అలాంటి కోర్సులను విద్యార్థులకు అందిస్తున్నారు. దీంతో దక్షిణ భారత దేశంలోని విద్యార్థులు ఇక్కడకే వస్తున్నారు. ఉత్తర భారత దేశానికి చెందిన విద్యార్థులు కూడా చాలామంది చదువుతున్నారు. భవిష్యత్తుకు అనుగుణంగా డిగ్రీ, పీజీ కోర్సులు అందిస్తున్నారు.

-మారెన్, డిగ్రీ తృతీయ సంవత్సరం, ఎకనామిక్స్

అవకాశాల నిధి..



విద్యార్థులకు సెంట్రల్ యూనివర్సిటీ అవకాశాలు కల్పించే నిధి లాంటింది. ఫార్మా, ఫుడ్ సేఫ్టీ, ఇంజనీరింగ్, అగ్రికల్చర్ తదితర రంగాల్లో అవకాశాలు కల్పించేలా కోర్సులను ప్రవేశ పెట్టారు. ఇక్కడ విద్యను పూర్తి చేసుకుని డిగ్రీ పట్టా అందుకున్న విద్యార్థులు ఉన్నత భవిష్యత్తును అధిరోహిస్తారు.

-అశ్విని, పీజీ ద్వితీయ సంవత్సరం, మాలిక్యులర్ బయాలజీ


అకడమిక్ బ్లాక్


తరగతుల నిర్వహణపై విద్యార్థులను ఆరాతీస్తున్న వీసీ ఎస్ఏ కోరి

చరిత్రలో నిలిచిపోయేలా..

వంద సంవత్సరాలపాటు విద్యనందించే వర్సిటీగా నిలిచిపోయేలా సెంట్రల్ యూనివర్సిటీని ప్రభుత్వం ఏర్పాటుచేసింది. వేలాది మంది విద్యార్థులు డిగ్రీ, పీజీ కోర్సులు అభ్యసిస్తున్నారు. చరిత్రలో నిలిచిపోయేలా విశ్వవిద్యాలయం ఏర్పాటైంది.

- ప్రొఫెసర్ ఎస్ఏ కోరి, సెంట్రల్ యూనివర్సిటీ వీసీ

సివిల్స్‌కు పట్టు



సివిల్స్‌లో ర్యాంకులు కొట్టేందుకు ఢిల్లీ వరకు ప్రత్యేక కోచింగ్ తీసుకునేందుకు విద్యార్థులు పరుగులు పెడుతున్నారు. సెంట్రల్ యూనివర్సిటీలో డిగ్రీ నుంచే సివిల్స్ పరీక్షపై పట్టు సాధించే స్థాయిలో బోధిస్తున్నారు. అనంతపురంలో ఇలాంటి వర్సిటీని ఏర్పాటుచేయడం వరమే.

-మెగావత్ లావణ్య, డిగ్రీ ద్వితీయ సంవత్సరం, పొలిటికల్ సైన్స్

విద్యార్థులకు ప్రాధాన్యం



వర్సిటీలో చదివిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రాధాన్యత ఇస్తున్నారు. మాలిక్యులర్ బయాలజీలో ఇదే వర్సిటీలో పీజీ పూర్తిచేశా. ఉద్యోగ ప్రకటనతో దరఖాస్తు చేసుకుని ఇంటర్వ్యూకి వచ్చా. ఇక్కడి విద్యార్థులకు ప్రాధాన్యత ఇచ్చేలా అదనపు పాయింట్లతో అవకాశాలు కల్పిచండంతో ల్యాబ్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించా.

- అజ్మతుల్లా, ల్యాబ్ అసిస్టెంట్, మాలిక్యులర్ బయాలజీ

వడ్డీ వ్యాపారులను కఠినంగా శిక్షించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్


కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న రాంభూపాల్, నాయకులు

ధర్మవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో చేనేత కార్మికుడు రమణ, ఆయన కుటుంబ సభ్యులపై దాడి చేసిన వడ్డీ వ్యాపారులను కఠినంగా శిక్షించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం నాయకులతో కలిసి సోమవారం సాయంత్రం ఆయన చేనేత కార్మికుడు రమణ ఇంటికి వెళ్లి పరామర్శించారు. జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమణ తాను తీసుకున్న అప్పు రూ.2లక్షలు, స్నేహితుడికి పూచి పడి ఇప్పించిన అప్పు రూ.4లక్షలు మొత్తం రూ.ఆరు లక్షలకు వారానికి రూ.60వేలు వడ్డీ చెల్లించినట్లు సీపీఎం నాయకులకు వెల్లడించారు. ఇప్పటి వరకు మొత్తం రూ.15.3లక్షలు చెల్లించానని, దానికి సంబంధించిన అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నట్లు వారికి వివరించారు. అనంతరం రాంభూపాల్ మాట్లాడుతూ రూ.15లక్షలు వసూలు చేసుకుని కూడా చేనేత కార్మికుడు, ఆయన కుటుంబ సభ్యులపై దాడి చేయడం దారుణమన్నారు. పోలీసులు సమగ్ర విచారణ జరిపి వడ్డీవ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం, మంత్రి సత్యకుమార్ తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఎంనాయకులు జంగాలపల్లి పెద్దన్న, జేవీరమణ, మారుతి, ఆదినారాయణ, అయూబ్‌ఖాన్, హరి, ఎస్ఎఫ్ఐ నాయకుడు నాగార్జున ఉన్నారు.

రుయాలో గుండె పోటుతో వైద్యుడి మృతి


డాక్టర్ నరేంద్ర (ఫైల్)

తిరుపతి(వైద్యం), జూలై 28(ఆంధ్రజ్యోతి): వార్డులో రోగులను పరీక్షించిన వైద్యుడు.. బయటకు వస్తూనే కుప్పకూలారు. గుండె పోటుకు గురై మృతిచెందారు. ఈ విషాద ఘటన తిరుపతిలోని రుయాస్పత్రిలో సోమవారం చోటుచేసుకుంది. జనరల్ మెడిసిన్ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ నరేంద్ర(55) సోమవారం మధ్యాహ్నం వరకు వార్డులో పలువురు రోగులను పరీక్షించారు. మరో వార్డులో రోగులను పరీక్షించేందుకు వెళుతున్న సమయంలో గుండెపోటు రావడంతో ఆస్పత్రి ఆవరణలోనే కుప్పకూలారు. వెంటనే వైద్య విద్యార్థులు, వైద్య సిబ్బంది ఆయన్ను పక్కనే ఉన్న అత్యవసర విభాగానికి తీసుకెళ్లారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం స్విమ్స్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందారు. ఈయన స్వగ్రామం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం. ఇటీవలనే నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి బదిలీపై రుయాస్పత్రికి వచ్చారు. ఆయన మృతికి ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రాధతోపాటు పలువురు వైద్య విభాగాధిపతులు సంతాపం తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో దంపతుల ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న దంపతులు

బొమ్మనహాళ్, జూలై28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో ఆర్యవైశ్య కాంప్లెక్స్‌లో ఒక జంట అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. స్థానికులు, బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ తెలిపిన మేరకు కర్ణాటకలోని హొస్పేట్‌కు చెందిన హఫ్రీనా(20), రెహమాన్(25) దంపతులు నెల రోజులు కిందట ఆంజనేయస్వామి దేవాలయం, కాంప్లెక్స్‌లకు రంగు వేసేందుకు వచ్చారు. ఆర్యవైశ్య కాంప్లెక్స్‌లో ఒక గదిని అద్దెకు తీసుకుని పెయింట్ పనులు చేస్తున్నారు. దేవాలయం పెయింట్ పనులు ముగిసిన తర్వాత గ్రామంలో మరికొందరి పెయింట్ పనులు చేస్తున్నారు. ఏమి జరిగింతో కాని సోమవారం ఉదయం నుంచి బయటకు రాలేదు స్థానికులు కొందరు గది కిటికీలో నుంచి చూడగా దంపతులు ఉరికి వేలాడుతూ కనిపించారు. దీంతో బొమ్మనహాళ్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టమోటాలు కిలో రూ.40

అనంతపురం రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం కిలో టమోటాలు రూ.40తో అమ్ముడుపోయాయి. అలాగే సరాసరిగా రూ.34, కనిష్టంగా రూ.20 పలికాయి. మార్కెట్‌కు మొత్తంగా 3,300టన్నుల టమోటాలు వచ్చినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు.

ఎస్కేయూను ఉన్నత స్థానంలో నిలుపుదాం

- వైస్ చాన్స్‌లర్ ఆచార్య అనిత
- ఘనంగా వర్సిటీ ఫౌండేషన్ డే


జ్యోతి వెలిగిస్తున్న వీసీ

అనంతపురం రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): సమష్టిగా పనిచేసి యూనివర్సిటీని ఉన్నత స్థానంలో నిలుపుదామని ఎస్కేయూ వీసీ ఆచార్య అనిత పిలుపునిచ్చారు. వర్సిటీలోని భువన విజయ ఆడిటోరియంలో సోమవారం యూనివర్సిటీ ఫౌండేషన్ డేను ఘనంగా నిర్వహించారు. వర్సిటీ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వీసీ ఆచార్య అనిత, విశిష్ట అతిథిగా యూనివర్సిటీ మాజీ రెక్టార్ విశ్వేశ్వరరావు, యూనివర్సిటీ రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు హాజరయ్యారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎంతో మంది కృషి వలన యూనివర్సిటీ ఉన్నత స్థానంలో ఉందన్నారు. రూసా నిధులతో పది సమినార్ హాళ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. పీఎం ఉష కింద రూ.20కోట్ల అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. వాతావరణ శాస్త్ర అధ్యయనాలు, భౌతిక శాస్త్ర విభాగంలో ఇస్రో వారి సహకారంతో పరిశోధనలు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. విశిష్ట అతిథి విశ్వేశ్వర రావు మాట్లాడుతూ వీసీ అనిత యూనివర్సిటీ అభివృద్ధికి ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. విద్యార్థులు వర్సిటీలోని వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఫౌండేషన్ డేను పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బోధన, బోధనేతరసిబ్బంది, విశ్రాంత అధ్యాపకులు, వర్సిటీలోని వివిధ కళాశాల ప్రిన్సిపాళ్లు, పరిశోధక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రికార్డు ప్రవాహం

- హంద్రీనీవాలో 2వేలకుపైగా క్యూసెక్కులు
- కాలువ చరిత్రలో అత్యధికంగా నీరు సరఫరా
- రాగులపాడు వద్ద 8 పంపుల ద్వారా ఎత్తిపోతలు
- అన్నదాతల హర్షం


రాగులపాడు లిఫ్ట్ వద్ద ఎనిమిది పంపుల నుంచి దూకుతున్న నీరు

ఉరవకొండ/బెళుగుప్ప, జూలై 28(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ చరిత్రలోనే అత్యధికంగా నీరు పారిస్తున్నారు. వజ్రకరూరు మండలం రాగులపాడు వద్దనున్న లిఫ్ట్ వద్ద సోమవారం ఏకంగా ఎనిమిది పంపుల ద్వారా నీటిని ఎత్తి పోస్తున్నారు. కాలువ చరిత్రలో ఇప్పటివరకు 6 పంపులతోనే తోడేవారు. ఏకంగా 8 పంపులతో ఎత్తిపోయడం ఇదే ప్రథమం. గతంలో అత్యధికంగా 1,700 క్యూసెక్కులు మాత్రమే కాలువలో పారింది. ప్రస్తుతం 2 వేలకుపైగా క్యూసెక్కులు పారిస్తున్నారు. మొత్తం 12 పంపులతో 3,600 క్యూసెక్కుల నీటిని కాలువలో ప్రవహింప జేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ప్రస్తుతం జీడిపల్లి జలాశయానికి 1,382 క్యూసెక్కుల నీరు చేరుతోంది. జీడిపల్లి రిజర్వాయర్ పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 1.68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.398 టీఎంసీల నీరు ఉంది. మరో మూడు రోజుల్లో జలాశయం నిండనుంది. ఆ తరువాత నీటిని పీఏబీఆర్‌కు వదిలేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలోని చాయాపురం, రాగులపాడు, జరుట్ల రాంపురం, చిన్నముష్టూరు తూములకు 100 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. 34వ ప్యాకేజీలో డీ1, డీ2 డిస్ట్రిబ్యూటరీలకు 60 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు హెచ్ఎన్ఎస్ఎస్ డీఈ శ్రీనివాస్ నాయక్ తెలిపారు.

పీఏబీఆర్‌ను నింపండి: మంత్రి కేశవ్

జీడిపల్లి రిజర్వాయర్ నిండిన వెంటనే పీఏబీఆర్‌కు వదలాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్.. ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. హంద్రీనీవా కాలువకు ఎనిమిది పంపులతో నీటిని విడుదల చేస్తున్నామన్నారు. పీఏబీఆర్ నిండేలోపు ఫేజ్-2 పనులను పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు.

ఆ శివయ్య వేరయా..!

- పెద్దాస్పత్రిలో ప్రైవేటు 'శివయ్య' వసూళ్లు
- అదే పేరున్న ఉద్యోగికి తంటాలు


సాకే శివయ్య

అనంతపురం వైద్యం, జూలై 28(ఆంధ్రజ్యోతి): సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులను మభ్యపెడుతూ ఒక వ్యక్తి వసూళ్ల పర్వం సాగించాడు. సదరం సర్టిఫికెట్ల మంజూరు, వెరిఫికేషన్, ఆరోగ్యశ్రీ, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ తదితర రూపాల్లో డబ్బు వసూలు చేయసాగాడు. ఆసుపత్రిలోని సిబ్బంది పేర్లుచెప్పి పనులు చేయిస్తానని బాధితులకు నమ్మబలికాడు. వారి నుంచి నగదుతోపాటు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బు వేయించుకున్నాడు. వార్డులోని పేషెంట్లతోనూ వసూళ్లకు పాల్పడ్డాడు. ఇలా దందాలు సాగిస్తున్నాడని సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం దుబ్బర్లపల్లికి చెందిన సాకే శివయ్యగా గుర్తించి కేసు నమోదుచేసి, అరెస్టు చేశారు. ఆసుపత్రిలోని కంటి విభాగంలో దంపెట్ల శివయ్య అనే ఉద్యోగి పనిచేస్తున్నారు. వసూలు చేస్తున్నది దంపెట్ల శివయ్య అని ఆసుపత్రిలో చర్చ మొదలైంది. దీంతో వసూళ్ల శివయ్య తానుకాదనీ, దుబ్బర్లపల్లికి చెందిన సాకే శివయ్యగా గుర్తించి కేసు నమోదు చేసి అరెస్టు చేశారని అధికారులకు దంపెట్ల శివయ్య లేఖ ఇచ్చుకోవాల్సి వచ్చింది.

'తరిమెల' ఆశయాలను కొనసాగిద్దాం

- సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకుడు జాస్తి కిషోర్‌బాబు


మాట్లాడుతున్న జాస్తి కిషోర్‌బాబు

అనంతపురం టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పోరాట యోధుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకుడు జాస్తి కిషోర్‌బాబు పేర్కొన్నారు. తరిమెల నాగిరెడ్డి 49వ వర్ధంతిని సోమవారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాస్తి కిషోర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తరిమెల నాగిరెడ్డి విద్యార్థిగా ఉన్నపుడే జాతీయ ఉద్యమానికి ప్రభావితుడై బెనారస్ విశ్వవిద్యాలయంలో విద్యార్థి నాయకుడిగా ఎన్నికయ్యారన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు సిద్ధాంతాల మధ్య ఉన్న తేడాలను గుర్తించిన ఆయన ప్రజలకు నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాన్ని, మెరుగైన జీవితాన్ని సాధించిపెట్టగలిగేది కమ్యూనిస్టు సిద్ధాంతమేనని నిర్ధారణకు వచ్చి, తన తుది శ్వాస వరకూ కమ్యూనిస్టుగా కొనసాగారన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచిన ఆయన చట్టసభల్లో పీడిత ప్రజలపక్షాన శక్తివంతంగా తన గళాన్ని వినిపించారని కొనియాడారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు అధ్యక్షుడు సూర్యసాగర్, మానవతా సంస్థ అధ్యక్షుడు తరిమెల అమర్నాథ రెడ్డి, ఎస్ఎం బాషా తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు నేడే ఆఖరు

కొత్తచెరువు, జూలై 28(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యాసంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి ఈనెల 29తో దరఖాస్తు గడువు ముగుస్తుందని జిల్లా విద్యాశాఖ సహాయ సంచాలకులు లాజర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పరీక్ష పూర్తిగా ఎన్‌వీఎస్(నవోదయ విద్యాలయ సమితి) కింద సీబీఎస్ఈలో ఉంటుందని ఆయన తెలిపారు. ఆసక్తి గల ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హెచ్‌టీటీపీ/సీబీఎస్ఈఐటీఎంఎస్.ఆర్‌సీఐయల్.జీఓవీ.ఇన్/ఎన్‌వీఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

అత్తారింటి వేధింపులపై కేసు

ధర్మవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): భర్త, అత్త తరచూ వేధిస్తున్నారని వడితే లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఆయన తెలిపిన మేరకు...ధర్మవరం లోని చంద్రబాబునగర్‌కు చెందిన రామ్మూర్తినాయక్ ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఇతడి భార్య వడితే లక్ష్మీదేవి గృహిణి. వివాహం అయినప్పటి నుంచి రామ్మూర్తినాయక్ తల్లి పార్వతిబాయి మాటలు విని లక్ష్మీదేవిని శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. మద్యానికి బానిసై, వివాహేతర సంబంధాలు నడుపుతూ, విడాకుల కోసం భార్యను వేధించేవాడు. పెద్దమనుషులు పంచాయితీ చేసినా మార్పు రాకపోవడంతో లక్ష్మీదేవి తన పుట్టినిల్లు అయిన నేలకోట గ్రామానికి ఇద్దరు పిల్లలతో కలిసి వచ్చి ఉంటోంది. అయినా ఫోన్‌లో ఆమెకు వేధింపులు ఆగలేదు. వీటిని భరించలేక సోమవారం ఆమె భర్త, అత్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రైలు ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

అనంతపురం న్యూటౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐ మిట్ట సమీపాన పట్టాలు దాటుతున్న మహిళను సోమవారం సాయంత్రం వందేభారత్ రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. రైల్వే ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 30 ఏళ్ల వయసున్న మహిళ రైలు పట్టాలు దాటుతుండగా.. బెంగళూరు నుంచి వచ్చిన వందేభారత్ రైలు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను వెంటనే 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అపస్మారక స్థితిలో ఉండటంతో వివరాలు తెలియలేదని ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9441445354 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

ఘరానా దొంగ పరార్..?

- సీసీఎస్ పోలీసుల అదుపులో నుంచి ఎస్కేప్
- ఐదు రోజుల క్రితమే తప్పించుకున్న వైనం?
- నిందితుడిపై 30 వరకూ కేసులు

అనంతపురం క్రైం, జూలై 28(ఆంధ్రజ్యోతి): అనంత సీసీఎస్ పోలీసుల అదుపులో ఉన్న ఘరానా దొంగ తప్పించుకున్నట్లు తెలుస్తోంది. తర్వాత దొంగను పట్టుకునేందుకు పోలీసులు పరుగులు తీసినట్లు సమాచారం. ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు. 5 రోజుల క్రితమే దొంగ తప్పించుకున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు.. కంబదూరు మండలంలోని వెంకటంపల్లి తండాకి చెందిన ఓ నిందితుడిని ఇటీవల సీసీఎస్ పోలీసులు తీసుకొచ్చినట్లు సమాచారం. చైన్ స్నాచింగ్స్‌లో పేరుమోసిన నిందితుడిపై 30 వరకూ కేసులున్నట్లు తెలుస్తోంది. అతడిని విచారిస్తుండగా పరారైనట్లు తెలిసింది. తేరుకున్న పోలీసులు మళ్లీ దొంగ వేటలో పడినట్లు సమాచారం. అప్పటికే సదరు దొంగ సొంతూరికి వెళ్లినట్లు తెలిసింది. పోలీసులు అక్కడికి వెళ్లి దొంగను మళ్లీ తీసుకొచ్చి విచారణ చేస్తున్నట్లు తెలిసింది. సంబంధిత పోలీసు అధికారులు ఘరానా దొంగ పరారీపై నోరు మెదపడం లేదు. ఏం జరగలేదు... అంతా తూచ్ అంటూ పెదవి విరుస్తున్నారు. దొంగ పరారీ ఘటన బయటకు ఎలా వచ్చిందంటూ పోలీసులు హైరానా పడుతూ కనిపించడం చూస్తుంటే... ఎస్కేప్ నిజమేనని తెలుస్తోంది. మరి ఈ నిర్లక్ష్యంపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఏం చేస్తారో చూడాలి.

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా 16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.11వేలు పలికాయన్నారు.

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



నాగులపుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ధర్మవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): నాగులచవితి వేడుకలను సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తులు ఉపవాసంతో నాగులపుట్ట వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి పాలుపోశారు. నూలుతో చేసిన దారాన్ని పుట్టకు చుట్టి తరువాత ఇంటి సభ్యులు చేతికి రక్షలాగా కడతారు. షిర్డీసాయిబాబా ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శివుడికి నాగ అలంకరణ చేయడంతో విశేషంగా ఆకట్టుకుంది.

రాష్ట్రస్థాయి హాకీ జట్టుకు ఎంపిక



ధర్మవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): హాకీ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఆగస్టు 8వ తేదీ వరకు చెన్నైలో జరుగుతున్న 15వజాతీయస్థాయి సబ్‌జూనియర్ హాకీ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టుకు ధర్మవరం క్రీడాకారుడు ఫజులుద్దీన్ ఎంపికైనట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాశ్ తెలిపారు. ఫజులుద్దీన్ ఈ ఏడాది మదనపల్లిలో జనవరిలో జరిగిన హాకీ జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి హాకీపోటీలకు ఎంపికయ్యారన్నారు. క్రీడాకారుడిని హాకీ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు బీవీ శ్రీనివాసులు, ముఖ్యులు బండి వేణుగోపాల్, గోపాల్, రామచంద్ర, గౌరీప్రసాద్, అస్లాం, రాఘవేంద్ర, అంజన్న, అరవిందగౌడ్, చందు, హస్సేన్, మారుతి, ఇర్షాద్, అమునుద్దీన్, కిరణ్ అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్య

కదిరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిజాంవలీకాలనీకి చెందిన బాబా ఫకృద్దీన్ (45) ఉరివేసుకుని సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. నిజాంవలీకాలనీకి చెందిన బాబాఫకృద్దీన్ అతిగా మద్యం సేవించి తన నివాసంలో ఎవరూలేని సమయంలో ఫ్యాన్ ఉరివేసుకున్నాడు. రెండు రోజులక్రితం భార్య తగాదా పడి పుట్టినింటికి వెళ్లిందన్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

కొత్తచెరువు, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారేపల్లికి చెందిన ఓ యువతి సోమవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుంటుంబ సమస్యలతో మనస్థాపానికి గురై ఆ యువతి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుందని గ్రామస్థులు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు పుట్టపర్తిలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలపడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురంలోని ఓ ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది.

పి-4 నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలి

నంబులపూలకుంట, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పి4 పథకం నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పేద కుటుంబాలను ఉన్నత స్థాయికి తీసుకురావడానికి సంపన్న వర్గాలు దత్త తీసుకోవాలన్న లక్ష్యంతో పి4 జాబితా సిద్ధం చేస్తున్నారని, ఉపాధ్యాయులు దత్త తీసుకోవాలని ప్రభుత్వం ఒత్తిడి చేయడాన్ని ఉపసంహరించుకోవాలని తెలిపారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి

తనకల్లు, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతపల్లి, చీకటిమానుపల్లి గ్రామాలకు చెందిన ఆర్యవైశ్యులకు శ్మశానవాటిక కోసం స్థలం కేటాయించాలని తహసీల్దార్ షాబుద్దీన్‌కు సోమవారం వినతి పత్రం ఇచ్చారు. బొంతపల్లి సర్వేనెంబర్ 154లో 50సెంట్లు స్థలం కేటాయించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ ఆ స్థలాన్ని శుభ్రం చేసుకుంటే కేటాయించనున్నట్లు హామీ ఇచ్చారు.

నీటి సమస్యను పరిష్కరించిన శ్రీరామ్

బత్తలపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బత్తలపల్లి ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పరిష్కరించారు. ఆదివారం రాత్రి బోరు వేయించారని కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఎస్సీ కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని స్థానిక టీడీపీ నాయకులు శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి పరిటాల రవీంద్ర ట్రస్టు ద్వారా బోరు వేయించారు. కార్యక్రమంలో నాయకులు జక్కంపూటి నాగభుషణ, రమణ, మనోజ్, శ్రీరాములు, సదాశివ, పెద్దన్న పాల్గొన్నారు.

తెరచుకున్న సులభ్ కాంప్లెక్స్

కొత్తచెరువు, జూలై 28(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని పుట్టపర్తి రహదారి పక్కన బస్‌షెల్టర్ లోపల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రజల సౌకర్యార్థం సులబ్ కాంప్లెక్స్ గతంలో నిర్మించారు. నీటి సరఫరా లేకపోవడంతో వారంరోజులుగా మూతపడింది. ఈ నెల 26న 'మూతపడిన సులహబ్‌కాంప్లెక్స్' అన్న శీర్శికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ ఈఓ శ్రీనివాసరెడ్డి ట్యాంకర్ ద్వారా నీటిని తోలించి సులబ్‌కాంప్లెక్స్‌ను తెరిపించారు.

కస్తూర్బా కాలనీ సమీపంలో బస్సులు ఆపాలి

ముదిగుబ్బ, జూలై 28(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా కాలనీ సమీపంలో బస్సులు ఆపాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ సౌత్ స్టేట్స్ గౌరవాధ్యక్షుడు వెంగమేష్ చౌదరి పేర్కొన్నారు. బస్సులు నిలపక పోవడంతో కస్తూర్బా స్కూల్ యాజమాన్యం, కాలనీ వాసులు బస్సులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ మేరకు ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం మధుసూదన్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను వివరించినట్లు పేర్కొన్నారు. ఆయన స్పందించి కస్తూర్బా కాలనీ సమీపంలో బస్సులు నిలిపేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

వాటర్‌షెడ్ పనుల పరిశీలన

నంబులపూలకుంట, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని ఎన్.రెడ్డివారిపల్లి, బందారుచెట్లపల్లి, మండల కేంద్రం సమీపంలో వాటర్‌షెడ్ పథకం కింద చేపట్టిన పలు అభివృద్ధి పనులను నేషనల్ లెవల్ మానిటరింగ్ టీమ్ ప్రాజెక్టు డైరెక్టర్ విజయప్రసాద్, ఏపీడీ క్రిష్ణ చైతన్య సోమవారం పరిశీలించారు. ఇంకుడుగుంతలు, ఫాంపాండ్లు, రాతి కట్టలు, చెక్ డ్యామ్ పనులను పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాటర్ షెడ్ చైర్మన్ మహబూబ్‌బాషాతోపాటు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రాజెక్టు డైరెక్టర్ విజయప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో టీమ్ లీడర్ దయాకర్‌రెడ్డి, ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి, పీఏ శ్రీనివాసులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బందారుచెట్లపల్లి వద్ద రాతికట్ట పనులను పరిశీలిస్తున్న అధికారులు

మార్కింగ్‌పై భవన యజమానుల్లో ఆందోళన



నాలుగురోడ్ల కూడలిలో కట్టడాలను తొలగిస్తున్న దృశ్యం

కొత్తచెరువు, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలికి ఇరువైపులా భవనాలకు ఆర్అండ్‌బీ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు మార్కింగ్ ఇచ్చారు. వాటి మేరకు కొంతమంది భవన నిర్మాణదారులు కట్టడాలను తొలగించుకున్నారు. గతంలో గొలుసు సర్వేతో ఇచ్చిన మార్కింగ్‌కు ప్రస్తుతం శాటిలైట్ ద్వారా ఇచ్చిన మార్కింగ్‌కు చాలా వ్యత్యాసాలు ఉన్నాయని భవనాల యజమానులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. నాగులు రోడ్లకు ఇరువైపులా ఉన్న నిర్మాణాలకు ఒక చోట ఒక విధంగా మరోచోట మరొక విధంగా ఇష్టానుసారం మార్కింగ్ ఇవ్వడం పలు అనుమానాలకు దారతీస్తోందని భవన యజమానులు మండిపడుతున్నారు. తాము నిర్మాణాలను తొలగించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఈ మార్కింగ్ వల్ల తమకు అపోహలు ఉన్నాయని, ఉన్నతాధికారులు స్పందించి మ్యాప్ ప్రకారం మార్కింగ్‌ను ఇవ్వాలని కోరుతున్నారు. నిర్మాణదారులు ఆర్డీఓ సువర్ణ, ఆర్అండ్‌బీ ఎస్ఈ సంజీవయ్య, జేఈ వన్నూర్‌స్వామి, విలేజ్ సర్వేయర్ అసిస్టెంట్‌లను వారు ప్రశ్నించారు. ఈ మార్కింగ్ వల్ల భవనాలు ఎక్కడికి వరకు తొలగిస్తారోనని అర్థం కావడంలేదని భవన యజమానులు వాపోతున్నారు. శాటిలైట్ మార్కింగ్ ప్రకారం బౌండరి రాళ్ల మేరకే తాము మార్కింగ్ ఇచ్చామని, ఎక్కడా పొరపాట్లు జరగవని అధికారులు తెలిపారు.

అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి: ఎమ్మెల్యే



హైమాస్ట్‌లైట్లకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం వినాయక నిమజ్జనానికి, ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవానికి విద్యుత్ తొలగించేవారని తెలిపారు. ఈ సంవత్సరం నుంచి ఆ ఇబ్బందులు లేకుండా చేస్తామని గతంలో మాట ఇచ్చామన్నారు. ఆ మేరకు పట్టణంలోని తిరువీధులతోపాటు రైల్వేస్టేషన్ రోడ్డులో విద్యుత్ టవర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకోసం రూ.4కోట్లు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. అలాగే పట్టణంలో 12 చోట్ల హైమాస్ లైట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకోసం రూ.36లక్షలు ఖర్చు చేస్తున్నామన్నారు. పట్టణంలో భద్రతను పెంచే క్రమంలో భాగంగా సీసీ కెమెరాలతోపాటు, కమాడ్‌కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశామన్నారు. ఇందుకోసం సీఎస్ఆర్ నిధులు రూ.60 లక్షలు సమకూర్చామని తెలిపారు. ఏడు సంవత్సరాలుగా బైపాస్‌రోడ్డు నిర్మాణం సాగుతోందని, ప్రస్తుతం సంవత్సరం నుంచి పలుమార్లు అధికారులతో సమావేశాలు నిర్వహించామన్నారు. భవిష్యత్‌తో ఎంపీడీఓ కార్యాలయం నుంచి పట్టణంలోకి ఖాద్రీలక్ష్మీ నరసంహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో భక్తుల కోసం ఎలక్ట్రికల్ బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణంలో గంజాయి, ఇతర మత్తుపదార్థాల కట్టడికోసం గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా కాలేజీ సర్కిల్‌లో, జీవిమానుసర్కిల్, కోనేరు సమీపంలో ఇనుప కమాన్లును ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పట్టణాభివృద్ధికి ప్రతిపక్షాలు, ప్రజలు సహకరించాలని కోరారు. రైల్వేస్టేషన్ రోడ్డు విద్యుత్ టవర్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. హైమాస్‌లైటర్లకు పూలే విగ్రహం వద్ద శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారధి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ భైరవప్రసాద్, టీడీపీ నాయకులు పవన్‌కుమార్ రెడ్డి, పర్వీనాభాను, మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీసా, ఆర్డీవో వీవీఎస్ శర్మ, డీఎస్పీ శివనారాయణస్వామి, కమిషనర్ కిరణ్‌కుమార్, సీఐ నారాయణరెడ్డి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం

టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామనని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. పట్టణంలో 37,38,39,40వార్డులలో మూడోరోజు 'మీ సమస్య...మా బాధ్యత' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్, విద్యుత్‌శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ స్వయంగా ప్రజల సమస్యలు తెలుసుకుంటూ అర్జీలను స్వీకరించారు. ముఖ్యంగా ఇళ్లు, ఇంటి పట్టాలు, హౌస్ మ్యాపింగ్, విద్యుత్ సమస్యలు, సంక్షేమ పథకాలు, సాంకేతిక కారణాలతో అందని అర్జీలు ఎక్కువగా వచ్చాయి. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ..ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకుని అందులో సాధ్యమైనవి వీలైనంత త్వరగా పరిష్కరించాలన్న ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమాన్ని శ్రీకారంచుట్టామన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, ఇందులో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిన అంశాలు కూడా ఉన్నాయన్నారు. వీటిని సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేశ్‌చౌదరి, నాయకులు పరిశే సుధాకర్, ఫణికుమార్, నాగూర్‌హుస్సేన్, శీలామూర్తి, రహీం, ఆది, పురుషోత్తం, సనత్, షరీఫ్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● తాడిమర్రి : మండలంలోని చిల్లవారిపల్లి, దాడితోట గ్రామ పంచాయతీలలో టీడీపీ మండల కన్వీనర్ కూచిరామ్మోహన్ ఆధ్వర్యంలో మీ సమస్య-మా బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, సాయి, హర్ష, శ్రీనివాసరెడ్డి, విశ్వనాథ్, రమణ, పక్కీర్‌రెడ్డి పాల్గొన్నారు.

వీఆర్‌కు కదిరి పట్టణ సీఐ

కదిరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): పట్టణ సీఐ నారాయణరెడ్డిని వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ రత్న సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం బదిలీ చేసినట్లు సమాచారం. నారాయణరెడ్డి కదిరి పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టి 11నెలలు పూర్తయింది. హఠాత్తుగా సీఐని వీఆర్‌కు పంపడంపై పలు రకాల చర్చలు వినిపిస్తున్నాయి.

సుపరిపాలన చంద్రబాబుతోనే సాధ్యం

పుట్టపర్తిరూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన అందించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో కూటమి ప్రభుత్వం ఏడాదికాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమపథకాలను కరపత్రాల ద్వారా ప్రజలకు తెలియచేశారు. కార్యక్రమంలో నాయకులు బీమినేని కిష్టప్ప, అమ్మినేని కేశవనాయుడు సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రశ్నించడమే నేరమా..?

ధర్మవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, పోరాటం చేయడం నేరమా అని ఎస్సీ జనసంఘం జాతీయ అధ్యక్షుడు కుళ్లాయప్ప పేర్కొన్నారు. సోమవారం పుట్టపర్తి కలెక్టరేట్ ముట్టడికి వెళుతుండగా ఎస్సీ జనసంఘం నాయకులను టూటౌన్ పోలీసులు ధర్మవరంలో అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సాయంత్రం సొంత పూచికత్తుపై విడుదలచేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ...ప్రజల సమస్యలపై ప్రశ్నించమే నేరమా అని ఆవేదన వ్యక్తం చేశారు.

బంగారు కుటుంబంలో భాగస్వాములవుతాం

పుట్టపర్తిరూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పి4 కార్యక్రమంలో తాము సైతం భాగస్వాములవుతామని ఎంపీపీ రమణారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు శ్రీరాంనాయక్ ముందుకొచ్చారు. సోమవారం మండల పరిధిలోని పెడపల్లి గ్రామపంచాయతీలో సర్పంచ్ మంగ్లీబాయి అధ్యక్షతన ఏర్పాటుచేసిన జీరో పావర్టీ పీ4 గ్రామ సభను ఏర్పాటుచేశారు. ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తులు పేదరికంలో ఉన్న కుటుంబాల బాధ్యత తీసుకోవాలన్నారు. ఎంపీపీ రమణారెడ్డి 5 కుటుంబాలను, శ్రీరాంనాయక్ 12 కుటుంబాల బాధ్యతను తీసుకోవడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఖాదర్‌బాషా, నాయకులు విజయ్‌కుమార్, బొమ్మయ్య పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఓబుళదేవరచెరువు, జూలై 28(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ఉగ్గిరెడ్డిపల్లిలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఎల్గొంటారని టీడీపీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 10గంటలకు ఉగ్గిరెడ్డిపల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహించి, మధ్యాహ్నం 12గంటలకు అల్లాపల్లి ప్రామిక సహకార సంఘం నూతన అధ్యక్షులు బోయపల్లి శివారెడ్డి ప్రమాణ స్వీకారానికి హాజరవుతారన్నారు.

బోర్డును తొలగించిన దుండగులు

కదిరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): పట్టణానికి సమీపంలోని ఆర్డీవో కార్యాలయం ఎదురుగా 2007లో భవన నిర్మాణ కాలనీకి పట్టాలిచ్చారు. ఇటీవల అందులో అనర్హులు ప్రవేశించి భవనాలు నిర్మించారు. దీన్ని సవాలు చేస్తూ భవన నిర్మాణ కార్మికులు కోర్టుకు వెళ్లారు. ఆ మేరకు భవన నిర్మాణాలకు ఇచ్చిన కాలనీ స్థలంలో ఎవరూ ప్రవేశించకూడదని ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో శనివారం పోలీసులు, రెవెన్యూ సిబ్బంది భవన నిర్మాణ కార్మికుల కాలనీవద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. సోమవారం నాటికి వాటిని గుర్తు తెలియని దుండగులు తొలగించి పక్కన పడేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని భవన నిర్మాణ కార్మికులు వలీ, రామక్రిష్ణ, బాబాఫకృద్దీన్, తదితరులు అధికారులను కోరారు.

సీపీఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

ముదిగుబ్బ, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఈనెల 31 నుంచి ధర్మవరం పట్టణంలో జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ నియోజకవర్గం కార్యదర్శి మునుగు మధు పిలుపునిచ్చారు. సోమవారం ముదిగుబ్బలో జరిగిన సీపీఐ మండల మహాసభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మండల నూతన కమిటీ ఏర్పాటు చేశారు. సీపీఐ మండల కార్యదర్శిగా చల్లా శ్రీనివాసులు రెండోసారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సహాయ కార్యదర్శులుగా తిప్పయ్య, ఈశ్వర్ నాయకులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, అమర్నాథ్, ఆదెప్ప, చిన్నప్ప, ప్రసాద్ నాయక్, వెంకటరాముడు పాల్గొన్నారు.

అన్నదాతా సుఖీభవ విడుదల చేయాలి

నంబులపూలకుంట, జూలై 28(ఆంధ్రజ్యోతి): రైతులకు వెంటనే అన్నదాత సుఖీభవ పథకం నిధులను విడుదల చేయాలని రైతు సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీలను నిలపెట్టుకోవాలని అన్నారు. రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేలు విడుదల చేస్తామని హామీ ఇచ్చాని, మాటను నిలపెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, స్వామిరెడ్డి, బాబాఫకృద్దీన్, చిన్నమల్లిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

చామాలగొందిలో కేంద్ర బృందం పర్యటన



బయ్యారెడ్డిపల్లిలో ఇంకుడుగుంతలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

గాండ్లపెంట, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చామాలగొంది పంచాయతీలో సోమవారం రెండోరోజు కేంద్ర బృందం పర్యటించింది. చామాలగొందిలో కేంద్ర బృందం పరిశీలకులు దయాకర్‌రెడ్డి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. పంచాయతీలోని బయ్యారెడ్డిలో పింఛన్‌దారులు, డ్వాక్రామహిళలు, హౌసింగ్ లబ్ధిదారులు, ఉపాధి పథకం కూలీలతో పలు విషయాలపై చర్చించారు. గ్రామాల్లో అభివృద్ధిపై పొదుపు సంఘం మహిళతో చర్చించి, వివిధ పనుల ద్వారా సంఘాలను ముందుకు నడుపుకుని రుణాలు చెల్లించుకుంటున్నామన్నారు. ఉపాధి హామీలో చేపట్టిన పంచాయతీ రాజ్ రోడ్లు, ఇళ్లు, ఫాంపాండ్లు, గోకులాలు, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను తనిఖీలుచేశారు. రికార్డులు, పనులు పరిశీలించారు. కార్యక్రమంలో పీడీ విజయప్రసాద్, ఏపీడీఓ రమేష్‌బాబు, ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, సర్పంచ్ శివప్పనాయుడు, ఏపీఓ చంద్రశేఖర్, వీఆర్ఓ చంద్ర, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కంకర మిషన్‌లో విజిలెన్స్ తనిఖీలు



కంకర మిషన్ వద్ద తనిఖీ చేస్తున్న విజిలెన్స్, మైనింగ్ అధికారులు

కదిరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని వైసీపీ నాయకుడు ప్రణీత్‌రెడ్డికి సంబంధించిన కంకర మిషన్‌లో సోమవారం విజిలెన్స్, మైనింగ్ శాఖాధికారులు తనిఖీలు చేశారు. విజిలెన్స్, మైనింగ్, సర్వే తదితర శాఖలు బృందంగా ఏర్పడి పరిశీలించారు. విజిలెన్స్ తనిఖీలు జరుగుతుండగా వైసీపీ నాయకుడు ప్రణీత్‌రెడ్డితోపాటు మరో 50మంది అక్కడికి చేరుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తున్నట్లు సీఐ జమాల్‌బాషా తెలిపారు. ఏడు నెలలక్రితం క్వారీలో అక్రమాలు జరుగుతున్నాయని ఫిర్యాదు రావడంతో సీజ్ చేశారు. ప్రస్తుతం క్వారీని కొలతలు వేసి, సర్వే చేశారు. అక్రమాలు బయట పడడంతో గతంలోనే భారీగా జరిమానా విధించారు.

బీజేపీలోకి వైస్ ఎంపీపీ చేరిక



బీజేపీలో చేరుతున్న వైస్ ఎంపీపీ, నాయకులు

తాడిమర్రి, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన వైస్‌ఎంపీపీ, నారసింపల్లి ఎంపీటీసీ క్రిష్ణమనాయుడు సోమవారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు రాము ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎంశేఖర్ సమక్షంలో పార్టీలోకి చేరారు. ఆయనతోపాటు నిడిగల్లు మాజీ సర్పంచ్ వెంకటనాయుడు, నాయకులు గోవిందు గంగులప్పతోపాటు మరికొంతమంది బీజేపీలోకి చేరారు.

చౌడేశ్వరి ఆలయానికి రూ.2.25 లక్షల విరాళం



ఆలయానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

అమడగూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గంగిరెడ్డిపల్లికి చెందిన డేగాని నారాయణరెడ్డి కుమారులు, కోడళ్లు, నారప్పరెడ్డి, రెడ్డెమ్మ, శేఖర్‌రెడ్డి, జయరామిరెడ్డి, రాతఽ, ప్రదీప్ సోమవారం చౌడేశ్వరి ఆలయంలోని నూతన తేరుకు(రథానికి) రూ.2లక్షల 25వేలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో విరాళాన్ని కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేంద్రరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రామిరెడ్డి, మంజునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేన వలంటీర్ల కమిటీ ఎంపిక

అమడగూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా పది పంచాయతీల్లో పంచాయతీకి నలుగురు చొప్పున జనసేన వలంటీర్లను ఎంపిక చేశారు. సోమవారం మండల కన్వీనర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. మహమ్మదాబాద్ సొసైటీ కార్యాలయంలో జనసేన నాయకులు సమావేశం నిర్వహించారు. పది పంచాయతీకు కమిటీ వాలంటీర్లను 40 మందిని నియమించి, పార్టీ అధిష్టానికి నివేదిక పంపనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, సొసైటీ చైర్మన్ నరేష్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ వైరు చోరీ

నల్లమాడ, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చౌటకుంటపల్లికి చెందిన కె. నాగరాజు అనే రైతు పొలంలో బోరు బావి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరును ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ విషయంపై రైతు పోలీసులకు ఫిర్యాదుచేశారు. గుర్తు తెలియని వ్యక్తులు బోరు వద్దకు వెళ్లి దిమ్మెపై అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందికి దింపి పగలకొట్టి కాపర్‌వైర్‌ను చోరీ చేసినట్లు చెప్పారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కదిరి అర్బన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అసోషియేషన్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం అసోషియేషన్ ఆధ్వర్యంలో ఎన్జీవో హోమ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోషియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు యజమాన్యం నిర్ణయించిన జీతాల ప్రకారం చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నబీరసూల్, జీవైపీ రావు, శంకర్, రవినాయక్, గణపతి, ఆంజనేయులు, శేఖర్, యాకుబ్ పాల్గొన్నారు.

ప్రయాణంలో అప్రమత్తంగా ఉండాలి

బత్తలపల్లి జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రయాణం చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. మండల కేంద్రమైన బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో ఆర్టీసీ బస్సులలో సోమవారం బత్తలపల్లి పోలీసులు ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది ఓబులేసు, లింగమయ్య, అనిల్‌కుమార్, నాగార్జున పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఓబుళదేవరచెరువు, జూలై 28(ఆంధ్రజ్యోతి): వ్యసాయంలోయాజమాన్య పద్ధతులు పాటించాలని డాట్ కోఆర్డినేటర్ రామసుబ్బయ్య, డీఆర్సీ చైతన్య పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొండకమర్లలో రైతు సేవాకేంద్రంలో రైతులకు యజమాన్య పద్ధతులు, భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు.

ఇతరుల ఖాతాలో 'తల్లికి వందనం'

సచివాలయంలో మహిళ నిరసన



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న సిద్దక్క

పరిగి, జూలై 28(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం నగదు జమకా లేదని సిద్దక్క సోమవారం సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తన కుమారుడు నవనీత్ జడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి చదువుతున్నాడని, తల్లికివందనం నగదు ఖాతాలో జమ అయ్యిందేమోనని పరిశీలించగా తమకు రావాల్సిన నగదు అదే పాఠశాలలో చదువుతున్న వేరే విద్యార్థి తండ్రి ఖాతాలో జమ అయినట్లు తెలిసిందన్నారు. వెంటనే ప్రధానోపాధ్యాయులను, సచివాలయ సిబ్బందికి సమస్యను తెలపడం జరిగిందన్నారు. పొరపాటున తల్లికివందనం నగదు జమ అయ్యిందని, వెంటనే డబ్బును ఇవ్వాలని సచివాలయ సిబ్బంది ఆ వ్యక్తిని కోరగా తాను ఖర్చుచేయడం జరిగిందని తెలిపాడన్నారు. పోలీసులకు ఈ విషయమై ఫిర్యాదు చేయగా రెండు రోజుల్లో నగదు సిద్దక్కకు అందేలా చర్యలు తీసుకుంటామని ఏఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

కళాశాల పూర్వ విద్యార్థికి పతకాలు



శ్రీవిద్యకు బంగారు పతకాలు అందజేస్తున్న గవర్నర్

మడకశిర రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి శ్రీవిద్య రెండు స్వర్ణ పతకాలను గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతుల మీదుగా అందుకున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సరోజినిదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విజయవాడలో ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయ 57వ స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి శ్రీవిద్య వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగంలో రెండు స్వర్ణపతకాలు సాధించింది. గవర్నర్ అబ్దుల్‌నజీర్, విశ్వ విద్యాలయ ఉపకులపతి డాక్టర్ శారదా జయలక్ష్మీ బంగారు పతకాలను శ్రీవిద్యకు అందించడం జరిగిందన్నారు.

అక్రమ కట్టడాలు తొలగించుకోవాలి

నగర పంచాయతీ కమిషనర్ సతీశ్‌కుమార్



నోటీసులు అందిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

పెనుకొండ టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా చేపట్టిన కాంపౌండ్‌వాల్‌ని వెంటనే తొలగించాలని నగర పంచాయతీ కమిషనర్ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం దర్గాగా కబ్జా అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అధికారులు మూడు రోజుల్లోపు కట్టడాలు తొలగించుకోవాలని నోటీసులు అందించారు. లేనిపక్షంలో తొలగిస్తామని హెచ్చరించారు.

ఎవరి భూమీ ఆక్రమించలేదు



ఆర్ఐకి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పెనుకొండ, జూలై 28(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని కొండాపురం గ్రామంలో తాము ఎవరి భూమిని ఆక్రమించుకుని ప్రహరీగోడ నిర్మించుకోలేదని తాతల కాలం నుంచి తమ అనుభవంలో ఉన్న గ్రామకంఠం భూమిలోనే ప్రహరీగోడ నిర్మించుకున్నామని నరసింహారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, గ్రామస్థులు నగర పంచాయతీ కమిషనర్‌కు తెలియజేశారు. ఈ మేరకు సోమవారం నగర పంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఆర్ఐ నాగరాజుకు వినతిపత్రం అందించారు. రస్తాభూమిని ఆక్రమించి ప్రహరీగోడ నిర్మించి దారిలేక ఇబ్బంది పెడుతున్నామంటూ గ్రామానికి చెందిన కొందరు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు.

తాడిపత్రికి చేరిన 'ప్రేమ ప్రవాహిని'



ప్రేమ ప్రవాహిని రథం

తాడిపత్రి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా సత్యసాయి దివ్యసందేశాన్ని భక్తులకు తెలియజేసేందుకు సత్యసాయి జిల్లా పుట్టపర్తి నుంచి ప్రారంభించిన ప్రేమ ప్రవాహిని రథం సోమవారం తాడిపత్రికి చేరుకుంది. ఈ రథాన్ని సత్యసాయి మందిరానికి సత్యసాయిసేవా సమితి సభ్యులు, భక్తులు ర్యాలీగా తీసుకువచ్చారు. రథాన్ని తిలకించడానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

ఘనంగా మంజునాథస్వామి ఆరాధనోత్సవం

బెళుగుప్ప, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మంజునాథస్వామి 51వ ఆరాధన మహోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం గణపతిపూజ, అశ్వర్థనారాయణస్వామి, నవగ్రహ పూజ, పంచామృతాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, వరుణ ప్రార్థన, మహామంగళహారతి, సాయంత్రం రథోత్సవం, రాత్రి భజనలతో ఉత్సవాలు ముగిశాయి.

రౌడీషీటర్లపై నిఘా ఏదీ..?

దర్గాగా భూపంచాయితీలు, దాడులు

చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ

పోలీసులపై ఆరోపణలు



లేపాక్షి పోలీస్ స్టేషన్ వద్ద రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ మహేశ్, సీఐలు

హిందూపురం, జూలై28(ఆంధ్రజ్యోతి): సాధారణంగా పోలీసు అధికారులు బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన వెంటనే తమ పరిధిలో ఉన్న రౌడీషీటర్లను పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వడం పరిపాటి. బాధ్యతలు స్వీకరించిన మొదటిరోజు రౌడీషీటర్లను హెచ్చరించి వారివైపు కొంతమంది ఎస్‌హెచ్ఓలు చూడటంలేదు. దీనివల్ల కొన్నిచోట్ల రౌడీషీటర్లు రెచ్చిపోతున్నారు. జిల్లాలో ఇటీవల జరిగిన కొన్ని నేరాల్లో రౌడీషీటర్ల ప్రమేయం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు కారణం రౌడీషీటర్లుగా ఉన్నవారిపై పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు వారు చేస్తున్న వృత్తి, వ్యవహారాలు, ఎవరితో కలిసున్నారన్న విషయాలపై నిఘా పెట్టాలి. అయితే వారిపై నిఘా గాలికి వదిలేశారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. దీనివల్లే కొంతమంది షీటర్లు రెచ్చిపోయి వ్యవహరిస్తున్నట్లు ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు రుజువు చేస్తున్నాయి. రెండు నెలల క్రితం పెనుకొండ సబ్‌డివిజన్‌లోని దక్షిణంవైపున్న మండలంలో జరిగిన ఓ నేరంలో రౌడీషీటర్ సహకరించాడని ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాన్ని బయటకు తెలిస్తే పోలీసులను అధికారులు ప్రశ్నిస్తారని నొక్కిపెట్టారు. ఇదే సబ్‌డివిజన్‌లో హిందూపురానికి ఆనుకుని ఉన్న మండలంలో ఓ రౌడీషీటరు నెల రోజుల క్రితం ఓ మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయమై పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ షీటరు నాలుగు రోజుల క్రితం హల్‌చల్ చేశాడు. అంతేకాక ఆయన నివాసం ఉండే ప్రాంతంలో నలుగురైదుగురిపై దాడికి కూడా యత్నించాడు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు సమాచారం వెళ్లినా స్పందించిన దాఖలాలు లేవు. 15 రోజుల క్రితం హిందూపురం సబ్‌డివిజన్‌లో జరిగిన ఓ ఘటనకు సంబంధించి షీటరు పరోక్షంగా సహకరించాడు. అయితే పోలీసులు అతడిని పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చి రిమాండుకు పంపారు. ఇవన్నీ ఇలా ఉంటే జిల్లాలో కలకలం రేపిన ఓ నేరానికి సంబంధించిన నిందితులు రౌడీషీటర్లుగా ఉన్నారు. వారిలో ఓ రౌడీషీటరు దర్గాగా హిందూపురం ప్రాంతంలో దందాలు చేస్తూ పంచాయతీలు కూడా చేస్తున్నట్లు సమాచారం. ఆఖరికి భూమిపంచాయతీ విషయంలో స్టేషన్‌కు వెళ్లినా పోలీసులు గుర్తించలేదంటే పరిస్థితి అర్థం అవుతుంది.

ఉదాసీనతే కారణమా..?

జిల్లాలో రౌడీషీటర్లపై ఒకటి రెండు చోట్ల మినహా మిగిలిన ప్రాంతాల్లో పోలీసులు రౌడీషీటర్లపై దృష్టి పెట్టిన దాఖలాలు కనిపించడం లేదు. రౌడీషీటర్లలో కూడా పలురకాల వ్యక్తులున్నారు. ఇందులో నేరాలకు పాల్పడి మోస్ట్‌వాంటెండ్‌గా ఉన్నవారు రౌడీషీటర్లుగా ఉన్నారు. మరికొంతమంది మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడినవారు, మరికొందరు రాజకీయనాయకులున్నారు. ఇందులో అధిక నేరాలకు పాల్పడి రౌడీషీటర్లుగా ఉన్నవారిపై పోలీసులు ఎప్పటిప్పుడు నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది. సంబంధిత కానిస్టేబుళ్లు వారి పరిధిలో ఉన్న రౌడీషీటర్లపై నిఘా పెట్టాల్సి ఉంటుంది. కానీ కొంతమంది రౌడీషీటర్లకు పోలీస్ సిబ్బంది కొందరు లోపాయి కారి ఒప్పందాలు ఉండటంతో వారిపై నిఘా పెట్టడంలేదని సమాచారం. దీనివల్ల పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రౌడీషీటర్లు రెచ్చిపోతున్నట్లు కొంతమంది పోలీసులే పేర్కొనడం గమనార్హం. దీనిని అలుసుగా తీసుకుని భూపంచాయతీలు, ఇతర నేరాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా నేర చరిత్రకలిగి ఉన్న రౌడీషీటర్లపై నిఘా పటిష్ఠం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రౌడీషీటర్లపై కన్నేసి ఉంచాం: మహేశ్, డీఎస్పీ, హిందూపురం

హిందూపురం సబ్‌డివిజన్ వ్యాప్తంగా 263 మంది రౌడీషీటర్లు ఉన్నారు. ఇందులో 27 మంది నేరచరిత్ర కలిగిన వారు. వీరిపై కన్నేసి ఉంచాం. వీరి కదలికలు కూడా గమనిస్తూ వారు చేస్తున్న వ్యవహారాలపై తరచూ ఆరాతీస్తున్నాం. నెలకోసారి పిలిచి కౌన్సిలింగ్ కూడా ఇస్తున్నాం.

అడంగల్ సమస్య పరిష్కరించండి

అధికారులకు బ్రహ్మసముద్రం వాసుల వినతి



సమస్య చెప్పుకుంటున్న బ్రహ్మసముద్రం రైతులు

సోమందేపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): తమ భూములకు సంబంధించిన 1బీ అడంగల్ ఆన్‌లైన్‌లో డిజిటల్ లాక్ అయ్యిందనీ, దీంతో డౌన్‌లోడ్ కావడంలేదని సమస్యను వెంటనే పరిష్కరించాలని బ్రహ్మసముద్రం గ్రామ రైతులు డీటీ రెడ్డిశేఖర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం వారు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ సర్వేనంబరు 110లో ఉన్న 34 ఎకరాల భూమిలో 24 మంది రైతులుండగా, ఏడుగురికి భూమి లేకపోయినా వారికి 1బీ అడంగల్ అందుబాటులో ఉందని, 17 మంది రైతులు సాగులో ఉన్నా తమ 1బీ అడంగల్ డిజిటల్ లాక్ అయి ఉందన్నారు. పదిరోజుల నుంచి కార్యాలయంచుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకే సర్వేనంబరులో 34 ఎకరాలు ఉండటంవల్ల అందులో ఎవరైనా కరెక్షన్‌కానీ, లేక కొత్త పాసుపుస్తకాల కోసం అప్లై చేసుకున్నా మ్యూటేషన్‌లో భాగంగా నెలరోజులపాటు లాక్ అవుతాయని డీటీ రెడ్డిశేఖర్ వారికి వివరించారు. 1బీ అడంగల్‌ను అన్‌లాక్ చేయిస్తామని హామీ ఇచ్చారు.

సర్వే ఆపాలంటూ ధర్నా

సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంగోడు పంచాయతీ గ్రామాల్లో సర్వేపనులు ఆపాలని సోమవారం రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. 55ఏళ్లుగా తాము సాగులో ఉన్నామని తమకు అసైన్డ్‌మెంట్ పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు. రైతులు రామక్రిష్ణారెడ్డి, హనుమంతరెడ్డి, అశ్వర్థరెడ్డి, దేవమ్మ, అనసూయమ్మ తదితరులు మాట్లాడుతూ తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమన్నారు. సర్వేనంబరు 28లో 1051ఎకరాలు గుట్టపోరంబోకు స్థలం ఉందని, పేద రైతులు ఎకరం నుంచి మూడెకరాల వరకు భూమి చదునుచేసుకుని సాగుచేసుకుంటున్నారన్నారు. గతంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తమకు అసైన్డ్‌మెంట్ పట్టాలు అందిస్తామని అధికారులు చెప్పారన్నారు. ప్రస్తుతం ఎలాంటి గ్రామసభలేకుండా రైతుల నుంచి ఆమోదం తీసుకోకుండా పరిశ్రమలకు భూములు అప్పజెప్పేందుకు సర్వేచేపట్టడం అన్యాయమన్నారు. తమకు పట్టాలు అందించి మిగిలిన భూములను పరిశ్రమలకు అందించాలని కోరారు. అనంతరం డీటీ రెడ్డిశేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని డీటీ రెడ్డిశేఖర్ వారికి తెలిపారు. కార్యక్రమంలో రైతులు నాగభూషణం, కిష్టప్ప, ఆదెప్ప, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువులను నింపాలి

జలసాధన సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాంకుమార్



మాట్లాడుతున్న రాంకుమార్

మడకశిర టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): చెరువులను నీటితో నింపాలని జలసాధన సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాంకుమార్ అన్నారు. కృష్ణ, హంద్రీనీవా నీటిని తెచ్చేందుకు మడకశిరకు బైపాస్ కెనాల్ ఏర్పాటు చేయాలని సూచించారు. సోమవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహించారు. జిల్లా జలసాధన సమితి నాయకులు, నియోజకవర్గంలో పలువురు రైతులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హంద్రీనీవా ప్యాకేజీ 57,56,58 సంబంధించి మిగిలిన పనులు పూర్తి చేయాలని కోరారు. తాత్కాలిక మరమ్మతులు కాలువకు చేసి నీటితో ప్రతి చెరువును నింపాలని డిమాండ్ చేశారు. కాలువ నిర్మాణానికి అలైన్‌మెంట్ పనులు పూర్తి చేయాలని కోరారు. మొదటి ప్రాధాన్యతగా గొల్లపల్లి రిజర్వాయర్‌కు నీరు వదలాలన్నారు. అమరాపురం, అగళి మండలాలకు సంబంధించి పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు. మడకశిర బైపాస్ కాలువ నిర్మాణం పూర్తి చేయడంతోపాటు మడకశిర బ్రాంచ్ కెనాల్ కాలువ సామర్థ్యం 1500 క్యూసెక్కులకు పెంచాలన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో హంద్రీనీవా కాలువ ద్వారా 3.45ఎకరాలకు పిల్ల కాలువల ద్వారా ఆయకట్టుకు నీరందించాలని కోరారు. కార్యక్రమంలో పట్టు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, రైతు సంఘం నాయకులు సోమకుమార్, ఆనందరంగారెడ్డి, పీ గంగిరెడ్డి, జయరామిరెడ్డి, ఉమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ అధికారులతో మంత్రి సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): రైతులకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని మంత్రి సవిత ఆదేశించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో మంత్రి సవిత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయానికి సాగునీరు అందించే పలు అంశాలపై చర్చించారు. అన్ని చెరువులకు నీరందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

నేడు రచ్చబండకు మంత్రి రాక

రొద్దం(ఆంధ్రజ్యోతి): కల్లుకుంట గ్రామంలో మంగళవారం నిర్వహించనున్న రచ్చబండకు మంత్రి సవిత హాజరుకానున్నట్లు మండల కన్వీనర్ నరహరి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు కార్యక్రమ నిర్వహణ ఉంటుందన్నారు. నాయకులు, కార్యకర్తలు, తరలిరావాలని కోరారు.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న బాధితులు

రొళ్ల, జూలై 28(ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలయ్యాయి. మండల పరిధిలోని దొడ్డేరి గ్రామానికి చెందిన తిప్పన్న, సన్నరంగప్ప, ఓబుళమ్మ, హనుమంతరాయప్పలను సోమవారం పిచ్చికుక్క కరిచింది. స్థానికులు వెంటనే రొళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. కాగా పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లాలంటే కుక్కల బెడద ఉంటోందని, సంబంధిత అధికారులు స్పందించి వాటి బెడద నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్మాణాలు చేపట్టకపోతే పట్టాలు రద్దు చేస్తాం

- హౌసింగ్ ఏఈ శ్రీనాథ్

పెనుకొండ, జూలై 28(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని జగనన్న లేఅవుట్‌లో ఇంటి పట్టాలు పొంది గృహాలు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని, లేనిపక్షంలో ఇంటిపట్టాలు రద్దు చేస్తామని హౌసింగ్ ఏఈ శ్రీనాథ్, కమిషనర్ సతీష్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం నగర పంచాయతీ కార్యాలయంలో గృహనిర్మాణం వేగవంతంపై కమిషనర్‌తో హౌసింగ్ ఏఈ సమావేశం నిర్వహించారు. మొత్తం 1400మందికి ఇళ్లపట్టాలు మంజూరుకాగా 893 మందికి ఇళ్లు మంజూరయ్యాయన్నారు. అందులో ఇప్పటి వరకు 412ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వీరంతా త్వరితగతిన ఇళ్లు పూర్తి చేయాలని, లేనిపక్షంలో పట్టాలు రద్దుచేస్తామన్నారు.

దివ్యాంగుడి దాతృత్వం

పాఠశాలకు మైక్ వితరణ

గోరంట్ల, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం ప్రాథమిక పాఠశాల కోసం రూ. 20వేలు విలువ చేసే మైక్‌సెట్‌ను సోమవారం దివ్యాంగుడు చాకలి ముద్దుశివప్ప ఇచ్చారు. పాఠశాల అభివృద్ధి కోసం హెచ్ఎం నీలం అశోక్ విద్యార్థుల తల్లిదండ్రుల సహకారాన్ని కోరారు. ఈ నేపథ్యంలో తాను కష్టపడి సంపాదించిన డబ్బుతో మైక్‌సెట్, ఆంప్లిఫైర్, బ్యాటరీలను పాఠశాలకు ముద్దుశివప్ప బహూకరించారు.

విద్యార్థికి వీల్‌చైర్..

గోరంట్ల, జూలై 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాలలో 10వ తరగతి చదువుతున్న నాగార్జునకు పూర్వ విద్యార్థి పూసల వెంకటరమణ వీల్‌చైర్ సమకూర్చారు. స్నేహితుడు ఫక్రుద్దీన్ ద్వారా వీల్ చైర్‌ను పాఠశాలలో హెచ్ఎం ఈశ్వర్‌ప్రసాద్ సమక్షంలో విద్యార్థికి సోమవారం అందించారు.

నేడు గోరంట్లలో విద్యుత్ అంతరాయం

గోరంట్ల, జూలై28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. గోరంట్ల పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేస్తుండటంతో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. చౌడేశ్వరీ కాలనీ, రామశంకరయ్యకాలనీ, శివాలయం కాలనీ, పోలీస్‌స్టేషన్ ప్రాంతం, కసిరెడ్డిపల్లి, జీనవాండ్లపల్లి గ్రామాల్లో ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటలవరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు





ప్రత్యేక అలంకరణలో చంద్రమౌళీశ్వరుడు, భోగి రామలింగేశ్వరుడు

మడకశిర టౌన్, జూలై28(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శివాలయాల్లో విశేష పూజలు జరిగాయి. పావగడ రోడ్డులో వెలిసిన చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి బిల్వపత్రంతో పూజలు చేశారు. తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. మిట్టబండ ఆంజనేయస్వామి, అభయ ఆంజనేయ స్వామి దేవాలయాల్లో పూజలు వైభవంగా సాగాయి. భోగి రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివుడికి ఉదయం నుంచి రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. నాగులచవితి పండుగను నిర్వహించారు.

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా అర్చకులు రాఘవేంద్ర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

అగళి(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయాల్లో శ్రావణమాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. కొమరేపల్లి బీరలింగేశ్వరస్వామి, మధుడి, వీరభద్రేశ్వరస్వామి, అగళి శంకరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జంగమరణపల్లి గ్రామంలోని పురాతన దేవాలయంలో వెలసిన బసవన్నకు పూజలు చేశారు. భక్తాదులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉమేష్, కో కన్వీనర్ కమ్మరి శివన్న, కిష్టప్ప, మండల బీసీ సెల్ అధ్యక్షుడు రాజగోపాల్, శివన్న పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గుడిబండ, జూలై 28(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. సోమవారం సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో సహకార సంఘాలు నిర్వీర్యమయ్యాయని ఆరోపించారు. పుట్టపర్తి నుంచి యురియురు వరకు నేషనల్ హైవే ఏర్పాటుచేసి మడకశిర ప్రాంతం అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు మంజునాథ్, నాయకులు శివకుమార్, దుర్గేష్, శ్రీనాథ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ సెంటర్ మంజూరు

రొద్దం, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఓపెన్ స్కూల్ సెంటర్ మంజూరైనట్లు ఎంఈఓ జయభాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు, వ్యాపారాలు కొనసాగించే వారికి టెన్త్, ఇంటర్ పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. సెలవు రోజుల్లో తరగతులను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇంటర్, టెన్త్ చేరే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని వివరించారు. 14ఏళ్లు నిండినవారు ఓపెన్ స్కూల్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మరింత సమాచారానికి ఆయా గ్రామ వార్డు సచివాలయాల్లోకాని, 9959516301 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నీటి కోసం ధర్నా



కాలనీవాసులతో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ

పరిగి, జూలై 28(ఆంధ్రజ్యోతి): నీటి కోసం మండల కేంద్రంలోని ప్రశాంతినగర్‌వాసులు సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. కొన్నిరోజులుగా నీటి సమస్యతో ఇబ్బందులు పడుతూ వస్తున్నామన్నారు. సంబంధిత అధికారులకు పలుమార్లు సమస్యను తెలపడం జరిగిందన్నారు. అయితే మోటార్లలో సమస్య ఉందని, అందుకే సమస్య తలెత్తుతోందని అధికారులు తమకు వివరించారన్నారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు డిప్యూటీ ఎంపీడీఓ విజయభాస్కర్‌ను కోరారు. వారంరోజుల్లోగా మోటార్లకు మరమ్మతులు చేయించి నీరు అందేలా చర్యలు తీసుకుంటామని అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ప్రశాంతినగర్‌వాసులు నిరసనను విరమించారు.

ఆహ్లాదానికి క్రీడలు అవసరం: మున్సిపల్‌చైర్మన్



గెలుపొందిన జట్టుతో మున్సిపల్ చైర్మన్, మాజీ చైర్మన్

హిందూపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): క్రీడలు ఆహ్లాదానికి అవసరమని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. ఎంజీఎం క్రీడామైదానంలో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో భాగంగా సోమవారం ఫైనల్స్ మ్యాచ్‌లో ఎంఐఎం లెవెన్స్ రహమత్‌పురం జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్మన్ రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ అనీల్‌కుమార్ మాట్లాడుతూ క్రీడల్లో జయాపజయాలు సర్వసాధారణమన్నారు. ఓడినవారు గెలిచేందుకు ప్రయత్నించాలన్నారు. గెలిచినవారు మరింత మెరుగ్గా రాణించేందుకు కృషి చేయాలన్నారు. గెలుపొందిన జట్టుకు రూ.20వేలు నగదు, రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు ప్రెస్‌వెంకటేశ్, డైమండ్‌బాబా, ఫాజిల్, జబీ, ఆరిఫ్; సాదిక్, అన్సార్ తదితరులు పాల్గొన్నారు.